
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 19 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	190	210
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 19.0



ఆలయం ఎదుట చంద్రపట్నం వేస్తున్న యాదవ పూజారులు

చంద్రపట్నాన్ని కళ్లకద్దుకుని..

- మూడో రోజూ పెద్దగట్టు జాతరకు పోటెత్తిన భక్తులు
- ఉదయం అంతంతమాత్రంగా, సాయంత్రానికి పెద్దసంఖ్యలో భక్తుల రాక
- స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ, జాగృతి నాయకురాలు కవిత



బోనం ఎత్తుకున్న యువతి

పెద్దగట్టు జాతరలో భాగంగా రెండో ప్రధాన ఘట్టం చంద్రపట్నం కార్యక్రమం ముగిసింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. చంద్రపట్నాన్ని దర్శించుకుని కళ్లకద్దుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. భేరీ చప్పుళ్లు, కరారీ విన్యాసాల మధ్య గంపల ప్రదక్షిణలు, మొక్కుల చెల్లింపులు పూర్తి చేసుకున్నారు.

వివరాలు 6వ పేజీలో



ఉత్సవాలకు సిద్ధమైన యాదగిరీశుడి దేవాలయం

నేటినుంచి యాద'గిరి'పై సంప్రోక్షణ మహోత్సవాలు

- 23న ఉదయం 11.54గంటలకు మహాకుంభాభిషేకం
- దివ్య విమాన బంగారు (గాలి) గోపురం ఆవిష్కృతం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

యాదాద్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బంగారు విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం బుధవారం (ఈ నెల 19నుంచి) ప్రారంభంకానుంది. హోమాలు, జపాలు, హవనాలు, వేదాలు, పారాయణాలతో ఉదయం 11.54గంటలకు మహాకుంభ సంప్రోక్షణతో దివ్య విమాన బంగారు(గాలి) గోపురం ఆవిష్కృతం కానుంది. దేశంలోనే 50.5అడుగుల పంచతల గోపురం తొడుగుల 10,753.39చదరపు అడుగుల కోసం సుమారు 68.84కిలోల బంగారం వినియోగించారు. ఈ మహోత్సవాన్ని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కాగా, 2024 నవంబరు 6న స్థానిక ఆచార్యులు కళావరోహణ చేయగా ఈ నెల 23న మహాకుంభాభిషేకంతో కళారోహణ చేపట్టడంతో క్రతువు ముగుస్తుంది. ఈ వేడుకలు వానమామలై 31వ మధుర పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ అధ్యాత్మిక పండుగ కొనసాగనుంది.

యాగశాలలో హోమాలు

ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు సారథ్యంలో అర్చక బృందం

మిగతా 7వ పేజీలో..

హత్య కేసులో 17 మందికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి రూ.6వేలు జరిమానా
- 2017లో ప్రతీకార హత్యచేసిన 18మంది
- విచారణలో ఉండగా అనారోగ్యంతో ఒకరు మృతి
- నిందితుల్లో ఎనిమిది మంది 30ఏళ్లలోపు వయస్సు వారే
- తీర్పు చెప్పిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ, జిల్లా 2వ అదనపు జడ్జి
- తీర్పు వెల్లడించగానే నిందితుల కన్నీటి పర్యంతం
- స్వగ్రామం యాదాద్రి జిల్లా ఆజీంపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు



•7లో..

'నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి'

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు నూరుశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంతో పాటు అంగడిపేట గ్రామ పంచాయతీలో శ్మశానవాటిక, కంపోస్ట్ షెడ్డులను, పీఏపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కంపోస్ట్ షెడ్డులో వర్మి కంపోస్ట్ రూపొందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులు అన్ని అప్డేట్ చేయాలని, ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలాగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో కొండల్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, కార్యదర్శులు రాంబాబు, అక్షితరెడ్డి, పాల్గొన్నారు.

కన్నీరు మిగిల్చిన మిరప సాగు

- వెంటాడిన తెగుళ్లు
- క్వింటాకు రూ.14వేల వరకు ధర
- ఎకరానికి రూ.3లక్షలకు పైగా పెట్టుబడులు
- నష్టాలబారిన రైతులు





తెగుళ్ల బారిన పడిన మిరపతోట

మిర్యాలగూడ(వ్యవసాయం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎర్ర బంగారంగా పిలిచే మిరప సాగు రైతులకు కన్నీరు పెట్టిస్తోంది.. వాతావరణ మార్పులు, వరుస తెగుళ్లతో దిగుబడులు పడిపోగా, పెరిగిన పెట్టుబడులు, మార్కెట్లో మిరపకు ధర లేకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుపోయారు.

మిరప సాగులో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉంది. దేశంలో 8.72లక్షలు, రాష్ట్రంలో 3.63లక్షల ఎకరాల్లో మిరప సాగవుతోంది. రాష్ట్రంలో 6.54లక్షల టన్నుల మిరప ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 30వేల ఎకరాల్లో మిరప సాగవుతోంది.

సాగు భారం

జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో రైతులు ప్రధానంగా మిరప పంటను సాగు చేశారు. మూడేళ్లగా పంటలో నల్ల నల్లి వ్యాపించి ఆకు ముడత, దోమ, ఎర్ర నల్లి, జెమిని తెగులుతో పంట దెబ్బతింటోంది. మొక్క నాటు వేసిన దగ్గర నుంచి ప్రతి కూల వాతావరణ ప్రభావంతో ఆశించిన స్థాయిలో పంట ఎదుగుదల లేక దిగుబడులు పడిపోయాయి. ఎరువులు, పురుగు మందులు కూలీల ధరలు 50శాతం పెరగడంతో పెట్టుబడుల భారం అధికమైంది.

పెరిగిన పెట్టుబడులు

మెట్ట భూమి ఎకరా దున్నకానికి రైతుకు రూ.5వేల వరకు ఖర్చు వస్తోంది. మిర్చి విత్తనాలకు రూ.10వేలు వ్యయం అవుతోంది. పంటలో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుచేసి మొక్కలకు నీరందించేందుకు రూ.10వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఇక అడుగు పిండి (25బస్తాలు) వినియోగించాల్సి రావడంతో అందుకు సుమారు రూ.40వేలు ఖర్చవుతోంది. అంతర్ సేద్యం (6 సార్లు) రూ.6వేలు, కలుపు తీసివేత కూలి (5 సార్లు) రూ.4వేల వరకు రైతులకు వ్యయం అవుతోంది. మిర్చికి ఎక్కువగా పురుగు మందులు వాడాల్సి వస్తోంది. అందుకు మందులకు (9నెలల్లో 45-50సార్లు పిచికారీ) రూ.లక్షవరకు ఖర్చు వస్తోంది. ఇక పంట చేతికి వచ్చాక మిర్చి తీతకు ఒక్కో క్వింటాకు కూలీలకు రూ.6వేల చొప్పున ఎకరా భూమిలో వచ్చే 25క్వింటాళ్ల దిగుబడిరి రూ.1.50లక్షల

మిగతా 8వ పేజీలో...

మిర్చి సాగుతో నష్టాలే



ఈ ఏడాది 10 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట వేశాను. పంట వేసిన దగ్గర నుంచి తెగుళ్ల వ్యాప్తి అధికమయింది, పెట్టుబడులు, కూలీల ఖర్చు పెరిగింది. దిగుబడులు బాగా తగ్గిపోయాయి. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పంట గిట్టుబాటు కాలేదు.. చేసిన కష్టం చేతికి రాలేదు.

కూన్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, పెద్దగూడెం, అనుముల మండలం

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

సీఎస్ శాంతికుమారి





నల్లగొండ మునిసిపాలిటీలో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతీ రోజు ఫీడర్ వారీగా విద్యుత్ సరఫరాను సమీక్షించాలని, ఎక్కడైనా ట్రిప్ అయితే తిరిగి పునరుద్ధరించేందుకు ఎంత సమయం పడుతుందో విశ్లేషించాలన్నారు. తాగునీటి పథకాలకు, ఆస్పత్రులకు విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై పత్రికల్లో వచ్చే వార్తలకు తక్షణం స్పందించి ప్రజలకు ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా విషయాన్ని వివరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, గత ఏడాది విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. దేవరకొండ ప్రాంతంలో అదనపు ఫీడర్ ఏర్పాటుకు గుర్తించామన్నారు. గత రెండేళ్ల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఎనిమిది శాతం అదనపు లోడ్‌ను సైతం తట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. ప్రతీ రోజు విద్యుత్ సరఫరాను పర్యవేక్షించేందుకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి ప్రారంభమైనందున ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని వార్డు అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. గత ఏడాది నీటి డిమాండ్ ఆధారంగా ఈ ఏడాది తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఓవర్ హెడ్, మంచి నీటి ట్యాంకులన్నింటినీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలన్నారు. మున్సిపల్ శివారు కాలనీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాతో అంతరాయం కలిగితే దీన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వార్డు ఆఫీసర్లు లేదా సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించాలన్నారు. వీధి దీపాల ద్వారా విద్యుత్ ఆదా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవం కింద నాటిన మొక్కలు వేసవి ఎండల కారణంగా చనిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీరు పోయాలన్నారు. ఇటీవల వీఆర్వోలను వార్డు ఆఫీసర్లుగా నియమించినందున పని విధానాన్ని తెలుసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెంచేందుకు సిబ్బంది సమష్టిగా పనిచేయాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మిల్లర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాన్ని నూరుశాతం సాధించేందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేసా రవి, డాక్టర్ గీతావాణి, డాక్టర్ అరుంధతి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

'పౌర హక్కులకు సంకెళ్లు వేస్తున్న అమెరికా'

హాలియా, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు ఏజెంట్ల ద్వారా వెళ్లి మోసపోయిన భారతీయులను యుద్ధ ఖైదీలుగా సంకెళ్ల వేసి వెళ్లగొడుతుంటే ప్రధాని మోదీ తమాషాగా ట్రంప్‌తో స్నేహం చేయడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపి భారతీయులను తీసుకువచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని మోదీ అమెరికాలో ఉంటున్న భారత పౌరులను గౌరవంగా తీసుకురావడానికి ట్రంప్‌తో మాట్లాడేందుకు ఎందుకు చొరవ చేయడం లేదన్నారు. దేశ ప్రజలతో అవమానకరంగా వ్యవహరిస్తుంటే బీజేపీ నాయకులు, మంత్రులు, ఎంపీలు ట్రంప్ చర్యలను సమర్థించడం దుర్మార్గమన్నారు. పౌర హక్కులకు సంకెళ్లువేస్తున్న అమెరికాను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అవుతా సైదులు, రెబెల్లి వెంకటేశ్వర్లు, ఆవుల రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



దామరచర్లలో వన నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ వై.శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పచ్చునాయక్‌తండా, బొట్టితండా, తాళ్లవీరప్పగూడెం, వీర్లపాలెం, దామరచర్ల గ్రామాల్లోని నర్సరీలను ఆయన తనిఖీ చేసిన మాట్లాడారు. మొక్కల ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మూర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిస్టుల ఐక్యం ఎంతో అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

ఎంసీపీఐ(యు) ఆలిండియా కార్యదర్శి అశోక్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో సామాజిక. సాంస్కృతిక, ఆర్థిక అభివృద్ధికి సోషలిజమే ప్రత్యామ్నాయమని, కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంసీపీఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. రెండు రోజులపాటు జరిగే ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సమావేశాలు మంగళవారం స్థానికంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుందన్నారు. అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు పూనుకోవడం, యుద్ధాలు ఆపేందుకు సామ్రాజ్యవాద అమెరికా పూనుకోవడం పతనమవుతున్న సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు ఆదరణ ఏర్పడుతోందని శ్రీలంకలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వాన్ని గుర్తించాలన్నారు. దేశంలో బీజేపీ ప్రశ్నించే గొంతుకల భౌతిక నిర్మూలనకు తెగబడుతోందన్నారు. జమిలి ఎన్నికల నినాదం ముందుకు తేవడం, దొడ్డిదారిన రైతు వ్యతిరేక చట్టాల అమలుకు పూనుకోవడం లాంటి చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గాదగోని రవి, సైదమ్మ, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, కుంభం సుకన్య, నజీర్, రమేష్ హంసారెడ్డి, నర్రా ప్రతాప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్

ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధం చేయాలి

గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్

కట్టంగూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆధారంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20నాటికి అన్ని గ్రామాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా తయారు చేయడంతో పాటు నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు అందించే రూ.5లక్షల ఆర్థిక సాయం నాలుగు విడతలుగా చెల్లింపులు ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో చింతమల్ల చలపతి, పంచాయతీ కార్యదర్శులు వడ్లకొండ అశోక్, శ్రీధర్‌రెడ్డి, జయసుధ, రేణుక, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా రమేష్

నల్లగొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా జీవీ.రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి జేడీగా ఉన్న ఖాద్రీ నుంచి ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. రమేష్ నాగర్‌కర్నూల్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ, పదోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన బుధవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.



చంద్రపట్నాన్ని కళ్లకద్దుకుని...

● మూడో రోజూ జనసంద్రమైన గొల్లగట్టు ● స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని, ఎమ్మెల్సీ కవిత



పెద్దగట్టు పరిసర ప్రాంతాల్లో కిక్కిరిసిన భక్తులు

ఆంధ్రజ్యోతి ఓ లింగ ఓ లింగా Feb 16-20

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో పెద్దగట్టు శ్రీలింగమంతులస్వామి జాతరకు మూడోరోజైన మంగళవారం భక్తులు పోటెత్తారు. ఉదయం సాంప్రదాయం ప్రకారం ఆలయం ముందు చంద్రపట్నం వేశారు. చంద్రపట్నాన్ని కళ్లకు అద్దుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉదయం భక్తులు పలుచగా కనిపించినా మధ్యాహ్నం తరువాత భక్తులతో జాతర ప్రాంతం నిండిపోయింది. ఐదు లక్షల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు జీవాలను బలిచ్చారు. మహిళలు గంపలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేయగా కొంత మంది తలపై దీపం పెట్టుకుని ఓ లింగా.. ఓ లింగా అంటూ స్వామిని దర్శించుకున్నారు. మునిసిపల్, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకచర్యలు చేపట్టారు. భక్తులు జాతరలో కలియతిరిగి సందడి చేశారు. స్వామివారిని కులమతాలకు అతీతంగా దర్శించుకుంటున్నారు. రాత్రి ఏడు గంటల సమయంలో కొంత తొక్కిసలాట జరిగింది. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో చిన్నారులను తల్లిదండ్రులు భుజాలపై ఎక్కించుకున్నారు. లింగమంతుల స్వామిని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గొర్రెల, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, పల్లె రవికుమార్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సాంప్రదాయబద్ధంగా చంద్రపట్నం

మంగళవారం సాంప్రదాయం ప్రకారం ఆలయం ముందు చంద్రపట్నం వేశారు. యాచకులు, రాజులతో కలిసి సౌడమ్మ, లింగమంతులస్వామి చరిత్రను భక్తులకు కథల రూపంలో వినిపించారు. అనంతరం భైరవుడికి ఆచారం ప్రకారం పోలు రాశారు. చంద్రపట్నాన్ని వీక్షించిన భక్తులు కళ్లకు అద్దుకోవడానికి ఎగబడ్డారు.

నేడు నెలవారం

పెద్దగట్టు జాతర నాల్గో రోజైన బుధవారం నెలవారం నిర్వహిస్తారు. నూతనంగా తెచ్చిన మట్టి బోనం కుండలలో పాలు పొంగించి స్వామి వారికి పూజలు చేస్తారు. సౌడమ్మ తల్లికి సైతం మొక్కులు చెల్లిస్తారు.సాయంత్రం చంద్రపట్నాన్ని కళ్ళకు అద్దుకుని గుట్టపై ఉన్న పుట్టలో పోస్తారు. అనంతరం దేవరపెట్టెను గజ్జెల లాగులు ధరించి బేరీ చప్పుళ్ల, కఠారీ విన్యాసాలతో వైభవంగా ఊరేగింపుతో కేసారం గ్రామానికి తరలిస్తారు.

తిరిగి వెళ్లిన వాహనాలు

ఆదివారం రాత్రికే సుదూరప్రాంతాల నుంచి జాతరకు వచ్చిన భక్తులు మంగళవారం రాత్రి తిరుగు పయనమయ్యారు. రెండురోజులుగా స్వామి సన్నిధిలో ఉండి రెండేళ్లకు వస్తామంటూ దేవుడికి నమస్కరించి బయలుదేరారు.





స్వామి వారిని దర్శించుకున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీసీ సంఘ నాయకుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇతరులు

● భక్తులను సర్కస్ విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. బైకు రైడింగ్, గుమ్మిలో కారు, బైక్‌లతో చేసే విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. చిన్నపిల్లలు స్విమ్మింగ్‌పూల్‌లో బోటింగ్, జారుడు బల్లలు, రైలు ట్రాకింగ్‌తో సందడిగా గడిపారు.

● జాతరలో చెప్పులు భద్రంగా చూసుకునే వారు అనేకమంది వచ్చారు. జత చెప్పులు చూసుకుంటే రూ.10వసూలు చేస్తున్నారు.

● జాతరలో జాతకాలు చూసే వారు కూడా అధికంగా కనిపించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారు చిలుక జోస్యం, కంప్యూటర్ జోస్యం, పేక జోస్యంలో తమ బాగోగులను తెలుసుకున్నారు.

● జాతర మొదటిరోజు కొబ్బరికాయను రూ.50కి విక్రయించగా సోమవారం రూ.60కి, మంగళవారం ఏకంగా రూ.80వరకు విక్రయించారు. ఖచ్చితంగా రెండు కొబ్బకాయలు కొనాలని రూ.150 వసూలు చేశారు.

విహార యాత్రలో విషాదం

కృష్ణాపరివాహక ప్రాంతంలో నీట మునిగి వ్యక్తి మృతి

చందంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలం వైజాగ్‌కాలనీకి విహారయాత్రకు వచ్చిన ముగ్గురిలో ఓ వ్యక్తి కృష్ణానదిలో నీట మునిగి మృతి చెందాడు. నేరేడుగొమ్ము ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మిత్రులు షేక్ గౌసొద్దీన్, అల్లాఉద్దీన్, మహమ్మద్ షేక్ అదే ప్రాంతంలో ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నారు. ఎవరికీ వివాహాలు కాలేదు. విహారయాత్రకు సోమవారం సాయంత్రం తమ వాహనంలో వైజాగ్‌కాలనీకి వచ్చారు. సాయంత్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టు వెనుక జలాల్లో బోటింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు షేక్ గౌసొద్దీన్(33) నీటిలో పడి గల్లంతవటంతో మిగిలిన ఇద్దరు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గజఈతగాళ్లతో వెతికించారు. రాత్రి సమయం కావటంతో గాలింపు నిలిపివేయగా, మంగళవారం ఉదయం గౌసొద్దీన్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బోటును నిర్లక్ష్యంగా నడపటంతో ఈ సంఘటన జరిగిందని మృతుడి మిత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్వాహకుడు చింతకాయల రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్టలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



వృద్ధురాలి మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో గుర్తుతెలియని వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 17న స్థానిక సాయిబాబ ఆలయ పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వృద్ధురాలు (62) అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి స్థానిక పోలీసులు సమాచారమిచ్చారు. పోలీసులు వృద్ధురాలిని 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వృద్ధురాలు అప్పటికే మృతి చెందింది. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేను ఎస్‌ఐని మాట్లాడుతున్నా..

పోలీసుల పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

దేవరకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐని మాట్లాడుతున్నా, నగదు బదిలీ చేయాలని సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం దేవరకొండ సీఐ నర్సింహులు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెంటచింతలకు చెందిన రాజేందర్, నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్)కు చెందిన అనిల్ ముఠాగా ఏర్పడి మీ సేవా కేంద్రాలే లక్ష్యంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. మీసేవా కేంద్రాల ఎదుట ఉన్న ఫోన్‌నెంబర్లకు ఫోన్‌చేసి ఎస్‌ఐని మాట్లాడుతున్నా డబ్బులు ఫోన్‌పే చేయాలని కోరతారు, దీంతో నమ్మిన బాధితులు ఆ నెంబర్‌కు డబ్బులు వేసి మోసపోతున్నారు. ఈ నెల 17న దేవరకొండలోని మీసేవా కేంద్రం నిర్వాహకుడు జగపతిబాబుకు ఎస్‌ఐని మాట్లాడుతున్నా రూ.5వేలు అత్యవసరం ఉంది, ఫోన్‌పే చేయాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన జగపతిబాబు రూ.5వేలు ఫోన్ వచ్చిన నెంబర్‌కు ఫోన్‌పే చేశాడు. గంట తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి దేవరకొండ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. అనిల్, రాజేందర్‌లు దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ, భూపాలపల్లి, హైదరాబాద్ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎస్‌ఐ, పోలీసులమని చెప్పి సైబర్ మోసాలకు పాల్పడగా ఆయా పోలీస్‌స్టేషన్లలో వీరిపై కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. మంగళవారం ఉదయం దేవరకొండ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతన్న ఇద్దరిని పట్టుకొని విచారణ చేస్తే నేరం అంగీకరించినట్లు సీఐ తెలిపారు. అనిల్, రాజేందర్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కోర్టుకు రిమాండ్ చేశామన్నారు. అనుమానితులు ఫోన్‌చేసి డబ్బులు పంపాలని కోరితే మోసపోవద్దని, వెంటనే పోలీసులకు డయల్-100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ప్రయాణికురాలిపై కేసు నమోదు

మోత్కూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేసిందన్న కండక్టర్ ఫిర్యాదు మేరకు ప్రయాణికురాలిపై కేసు నమోదైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో జరిగింది. మంగళవారం ఎస్‌ఐ డీ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ కండక్టర్ జక్కు మాధవి ఫిర్యాదు మేరకు మోత్కూరు పట్టణానికి కేంద్రానికి చెందిన ప్రయాణికురాలు సైదమ్మపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ నెల 17న బస్సులో విధులు నిర్వహిస్తుండగా సైదమ్మ తనపై దాడి చేసి విధులకు భంగం కలిగించడంతో పాటు తన వద్ద నుంచి రూ.2వేలు, సెల్ ఫోన్ లాక్కుందని కండక్టర్ మాధవి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఈ నెల 17న తాను ఉదయం మోత్కూరు నుంచి బీబీనగర్ ఆర్టీసీ బస్సులో వెళ్లి సాయంత్రం తిరుగు ప్రయాణంలో అదే బస్సు ఎక్కినట్లు సైదమ్మ తెలిపింది. నీకు ఈ ఒక్క బస్సే ఉందా, వేరే బస్సులు లేవా ఇప్పటివరకు వేరే బస్సులో ఎందుకు వెళ్లలేదంటూ కండక్టర్ తనను దూషించి చెంపపై కొట్టిందని సైదమ్మ ఆరోపించింది.

మద్యం చోరీకి పాల్పడుతున్న వ్యక్తికి దేహశుద్ధి



శివయ్యను స్తంభానికి కట్టిన వైన్స్ సిబ్బంది

కోదాడ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వైన్స్‌లో మద్యం చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని దేహశుద్ధి చేసి గుంజకు కట్టివేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం పంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. రామాపురం క్రాస్‌రోడ్డులో చంద్ర వైన్స్ వెనుక భాగంలో మద్యం తాగటానికి వచ్చిన వ్యక్తుల ముందు సీసాలను చోరీకి పాల్పడుతున్న శివయ్యను మద్యం దుకాణ సిబ్బంది పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి మద్యం దుకాణం ఎదుట విద్యుత్ స్తంభానికి కట్టివేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన శివయ్య వైన్స్‌షాపులో మద్యం తాగటానికి వచ్చిన వ్యక్తుల వద్ద నుంచి సీసాను గుంజుకుని పోతున్నాడని వారు ఆరోపించారు. దీంతో అతను పట్టుకొని కొట్టి పోలీసులకు అప్పగించినట్లు మద్యం దుకాణ యజమాని తెలిపారు. మందలించి పంపినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాలీ వాహనం పల్టీ : ఒకరి మృతి

తిరుమలగిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ వ్యక్తి చనిపోగా, పలువురు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరుకు కొబ్బరికాయల లోడుతో ట్రాలీ వాహనం వెళ్తోంది. తిరుమలగిరిలోని కృష్ణవేణి పాఠశాల సమీపంలోకి రాగానే రోడ్డుమధ్యలోని గ్రిల్‌ను ఢీకొట్టి రోడ్డుకు అవతలిపైపు పల్టీకొట్టింది. వాహనంలో చిక్కుకున్న ఇరువురిని స్థానికులు బయటకు తీసి, 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా డ్రైవర్ పెంద్ర ప్రభుకుమార్(25) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుకుమార్ తమ్ముడు పెంద్ర శేఖర్ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరో సంఘటనలో గుంటూరు నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో సహా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి పంపించినట్లు పోలీసులు తెలిపారు.

బస్సు కింద పడి గాయాలు



రాజయ్యను ఆసుపత్రికి తరలిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు టైర్ కాళ్ల మీది నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట బస్టాండ్‌లో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజపేట మండలానికి చెందిన శీలా రాజయ్య మంగళవారం యాదగిరిగుట్ట బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కిందపడ్డాడు. దీంతో బస్సు ముందు టైర్ కాలమీది నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయి తీవ్రరక్తస్రావమైంది. హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆర్టీసీ బస్సులో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి ప్రమాదానికి సంబంధించిన వివరాలను, అధికారులను, ప్రయాణికులను అడిగి తెలుసుకుని విచారణ జరుపుతున్నారు. రాజయ్య కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

● 25 రోజులు మృత్యువుతో పోరాడి...



శ్రీనికేతన్

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి 25రోజులుగా మృత్యువుతో పోరాడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కన్నుమూశాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన మక్కెన శ్రీనికేతన్(24) తాత కట్టా భాస్కర్‌రావు మృతి చెందడంతో జనవరి 24న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామానికి అమ్మమ్మ వద్దకు వచ్చారు. అదేరోజు సాయంత్రం గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో కారులో పక్క గ్రామానికి వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి పల్టీలు కొట్టి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఎడమవైపున కూర్చున్న శ్రీనివాసరావుకు గాయాలు కాగా, కారు నడుపుతున్న మక్కెన శ్రీనికేతన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో చికిత్సపొందుతూ మంగళవారం శ్రీనికేతన్ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనికేతన్ కొన్నాళ్లు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. హైదరాబాద్‌లో పనిచేయాలనే ఉద్దేశ్యంతో ఇక్కడికి వచ్చి పనిచేస్తున్నారు. సుమారు 25రోజుల పాటు మృత్యువుతో పోరాడి మృతి చెం దాడు. నెలరోజుల వ్యవధిలోనే తాత భాస్కర్‌రావు, మనవడు శ్రీనికేతన్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి బంధువు కట్టా గోపాల్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీలగిరిలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం

● 30మందికి పైగా అదుపులోకి ..

● రౌడీషీటర్ రాజేశ్ రిమాండ్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో అక్రమాలు, బెదిరింపులు, హత్యలతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో రౌడీషీటర్లుగా చెలామణి అవుతున్న వారిని పోలీసులు తమదైనశైలీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. రౌడీయిజం పేరుతో సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ అరాచకాలు, అమాయకులను బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు కట్టడి చేస్తున్నారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతూ వారి కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో రౌడీషీట్ నమోదైన నలపరాజు రాజేష్ నల్లగొండ టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి ఆధ్వర్యంలో రిమాండ్‌కు తరలించారు. రౌడీషీటర్లలో కొంత మంది గంజాయి మత్తులో ఫోన్లు చేసి బెదిరించి సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి వారి ఆగడాలను అడ్డుకునే పనిలో నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్‌పీఎస్‌ల పరిధిలోని సుమారు 30 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఓ ప్రత్యేక విభాగంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎస్పీ శరత్ చంద్రపవార్ జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అక్రమాలు, బెదిరింపులు, రౌడీషీటరతో పాటు ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని ఉపేక్షించేది లేదని తమ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో పోలీసులు తమ పనిలో నిమగ్నమై మొదటగా రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



శెట్టి శ్రీశైలం

బీబీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడినట్లు బీబీనగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బీబీనగర్ మండలం ముగ్దుంపల్లి గ్రామానికి చెందిన శెట్టి శ్రీశైలం 2016లో తన భార్య దూరం కావడానికి కారకుడిగా భావించిన వ్యక్తిపై పగ పెంచుకుని హత్య చేశాడు. ఈ మేరకు బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కోర్టులో విచారణ కొనసాగుతుండగా మంగళవారం నేరం రుజువుకావడంతో జిల్లా ప్రథమ శ్రేణి ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు నిందితుడు శ్రీశైలంకు జీవితఖైదుతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి రెండు రోజుల జైలు

నల్లగొండక్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో న్యాయస్థానం ఓ వాహనదారుడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు నల్లగొండ జిల్లా కేంద్ర ట్రాఫిక్ సీఐ దూది రాజు తెలిపారు. పట్టణానికి చెందిన చాపల నరేష్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుపడిన నేపథ్యంలో జిల్లా కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారన్నారు. పట్టణంలో మద్యం తాగి వాహనం నడిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.


బ్యాగ్ తారుమారు.. పట్టించిన సీసీ కెమెరా



ఆనంద్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎస్‌ఐ క్రాంతికుమార్, హెచ్‌సీ బూతరాజు రమేశ్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తారుమారైన బ్యాగుతో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు గంటల వ్యవధిలోనే బాధితుడికి అందజేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి బ్యాగు తీసుకెళ్లిన వ్యక్తిని గుర్తించారు. ఈ సంఘటన నార్కట్‌పల్లిలో మంగళవారం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన అడాల ఆనంద్ ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌లో తెల్లవారుజామున విజయవాడకు బయలుదేరాడు. ఆనంద్‌తో పాటే అదే బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఓ ప్రయాణికుడు నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రి వద్ద బస్సు దిగాడు. అయితే అప్పటికి ఇంకా చీకటి ఉండటంతో ఆనంద్ తన సీటులో నిద్రిస్తూనే ఉన్నాడు. గంట తర్వాత బస్సు సూర్యాపేటకు చేరుకున్న తర్వాత నిద్రలేచి చూసుకోగా ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగు కనకపడకపోవడంతో ఆందోళన చెందాడు. అయితే నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రి వద్ద ఓ ప్రయాణికుడు బ్యాగు పట్టుకుని బస్సు దిగాడని తోటి ప్రయాణికులు ఆనంద్‌కు చెప్పారు. దీంతో సూర్యాపేట నుంచి వెనుదిరిగి నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆనంద్ తన బ్యాగు తారుమారైన విషయాన్ని డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బూతరాజు రమేశ్, పీసీ బండ గిరిబాబులకు వివరించాడు. వారు స్పందించి వెంటనే కామినేని ఆసుపత్రి వద్దకు వెళ్లి అక్కడి సీసీ ఫుటేజీ ఆధారంగా బ్యాగుతో కిందకు దిగిన వ్యక్తిని గుర్తించారు. బ్యాగ్‌తో బస్సు దిగిన వ్యక్తిని గుర్తుపట్టిన ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో పోలీసులు నల్లగొండకు వెళ్లి విచారించారు. అయితే ఏమరుపాటులో తన బ్యాగు అనుకుని తీసుకుని బస్సు దిగానని, వారికి ఆ బ్యాగ్‌ను స్వాధీన పర్చాడు. ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఎస్‌ఐ క్రాంతికుమార్ చేతుల మీదుగా ఆనంద్‌కు అందజేశారు. చాకచక్యంతో వ్యవహరించి గంటల వ్యవధిలోనే లాప్‌టాప్‌ను అందజేసిన పోలీసులకు ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైన అనిల్‌కుమార్



అనిల్‌కుమార్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన సంకలబుడ్డి అనిల్‌కుమార్ జాతీయస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన సీనియర్స్ రాష్ట్ర స్థాయి 71వ పురుషుల కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జిల్లా ప్రథమ స్థానం సాధించింది. ఈ పోటీల్లో అనిల్ అన్నిరంగాల్లో రాణించడంతో ఈ నెల 20 నుంచి 23 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్రం నుంచి పాల్గొనే కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. అనిల్‌కుమార్ ఎంపికపై గ్రామస్థులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు హర్షం వెలిబుచ్చారు.

మట్టపల్లి-హుజూర్‌నగర్ రహదారిపై 'బెల్టు' దందా

● ఇష్టారాజ్యంగా దుకాణదారుల నిర్వహణ ● పట్టించుకోని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

మఠంపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏ సమయంలోనైనా సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి- హుజూర్‌నగర్ రహదారిలో దొరుకుతుంది. మఠంపల్లి మండల నుంచి మట్టపల్లి వంతెన వరకు అర్ధరాత్రి సైతం బెల్టు దుకాణాల దందా యథేచ్ఛగా సాగుతోంది. పదుల సంఖ్యలో దుకాణాలు 24 గంటలు తెరిచే ఉంటున్నాయి. ప్రైవేట్ వాహన చోదకులే లక్ష్యంగా నడుస్తున్న ఈ వ్యాపారం ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరుగుతోంది. మఠంపల్లి మండలం తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. మట్టపల్లి సమీపంలోని కృష్ణానదిపై హైలెవల్ వంతెన ఉండటంతో ఈ దారి గుండానే సిమెంట్ పరిశ్రమల, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. దీనిని ఆసరా చేసుకుని కొందరు అక్రమ వ్యాపారానికి తెరతీశారు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ నుంచి మఠంపల్లి వయా మట్టపల్లి వరకు వెళ్లే ప్రధాన రహదారిలో ఇరువైపులా బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారే వరకూ దుకాణాలు తెరిచే ఉంచుతున్నారు. ఇన్ని బెల్ట్ దుకాణాలు నిర్వహణ సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. మద్యం మత్తులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. యువకులు మద్యం మత్తులో వాహనాలను అతివేగంగా నడుపుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి పూట పోలీసుల పెట్రోలింగ్ సరిగా నిర్వహించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దుకాణదారులు అధికారులకు మామూళ్లు ఇస్తుండటంతో ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

మఠంపల్లి మండలకేంద్రంతో పాటు శివారు ప్రాంతాలు, ప్రధాన రహదారిపై ఉన్న బెల్టు దుకాణాలు నడుస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ ఏడాది బెల్టు దుకాణాలపై కేసులునమోదు చేయలేదు. బెల్టు దుకాణాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం.

నాగార్జునరెడ్డి, ఎక్సైజ్ సీఐ

కేసు నమోదు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని మంగళతండా గ్రామంలో పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా డంప్ చేసిన గ్రామ మాజీ సర్పంచ్ జబ్బార్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. పాలేరు వాగుకు పెద్దఎత్తున వరదలు రావటంతో వాగుకు ఇరువైపులా ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో ఇదే అదునుగా భావించిన చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యక్తులు పెద్దఎత్తున వాగు నుంచి ఇసుకను తోడి గ్రామాల్లో డంప్‌చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జబ్బార్ కూడా సుమారు 30 ట్రిప్పుల ఇసుకను డంప్ చేశాడు. ఇసుకను విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో తహసీల్దార్ వాజీద్‌అలీ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో జబ్బార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు.



డంప్ చేసిన ఇసుక ఇదే

నక్షతో రికార్డులు పక్కా

కేంద్ర ప్రభుత్వం పట్టణాల్లో రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు. ఇళ్ల, స్థలాల, వివాదాలకు చెక్ పెట్టేందుకు నక్ష కార్యక్రమం చేపట్టనుంది. జనవాసాలు, భూములు, చెరువులు, రోడ్డు మార్గాలను శాటిలైట్ సర్వేతో వివరాలను పక్కా తేల్చనున్నారు. దేశవ్యాప్తంగా 100 మునిసిపాలిటీలను నిర్వహిస్తుండగా పైలెట్ ప్రాజెక్టుగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపాలిటీని ఎంపిక చేశారు. సర్వేకు సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులకు, ఏజెన్సీ సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. ఇటీవల హెలికాప్టర్ ద్వారా బేస్ పాయింట్లను గుర్తించారు. సర్వే ఆఫ్ ఇండియా, మునిసిపాలిటీ ల్యాండ్ సర్వే, డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా చేపట్టనున్న సర్వేపై వివిధ వర్గాల ప్రజలు 'ఆంధ్రజ్యోతి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

అక్రమార్కుల లెక్కలు తేలతాయి



మునిసిపల్ అనుమతులు లేకుండా పలుకుబడితో బహుళ అంతస్థులు నిర్మించుకుని ట్యాక్స్ చెల్లించకుండా తప్పుకునేవారికి ముకుతాడు వేసినట్లవుతుంది. తమకు ఉన్న ఆస్తుల ప్రకారం ప్రజలు పన్నులు చెల్లిస్తే పట్టణాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పన చేపట్టే అవకాశం ఉంటుంది. భూ ఆక్రమణలు, చెరువులు, నాలాల ఆక్రమణదారులపై చర్యలు తీసుకునే వీలు కలుగుతుంది. మునిసిపల్ ఆస్తుల రక్షణ ఉంటుంది.

- చిలుకూరి బాలు, బంగారిగడ్డ

సర్వే ఎంట్రీలో తప్పు దొర్లితే చిక్కులే



డిజిటల్ డేటా ఎంట్రీలో తప్పులు దొర్లితే ధరణిలాగా, నక్ష ప్రజలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంది. ఏజెన్సీలకు లబ్ధిచేకూర్చేందుకే ఈ సర్వే మునిసిపాలిటీని గతంలో అధికారులు 18 బ్లాకులుగా విభజించారు. అనేక ఇళ్లకు బై ంబర్లు ఇచ్చి తికమక చేశారు. అలా కాకుండా నక్ష రెండు వార్డులను ఒక బ్లాక్‌గానో, ఒక్కో వార్డును బ్లాక్‌గానో గుర్తించి ఇంటి నంబర్లు కేటాయిస్తే నక్ష పట్టణ ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. భవిష్యత్‌లో ఆక్రమణలను అడ్డుకోవచ్చు

- డబ్బికార్ మల్లేష్, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్

సమస్యను పరిష్కరించాలి



సర్వేతో అక్రమణలు గుర్తించినట్లే కాలనీల్లో సమస్యలను గుర్తించాలి. శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూమలను చోటా, మోటా నేతలు చెరపడ్డకుండా కట్టడి చేయాలి. డేటా ఎంట్రీల్లో తప్పులు దొర్లకుండా శాటిలైట్ చిత్రాలతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నమోదు చేసి ప్రజా ఆస్తుల క్రయవిక్రయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తేనే సామాన్యులకు సర్వేతో ప్రయోజనం

- తిరందాసు విష్ణు, ఇందిరమ్మకాలనీ

ఆదాయం ఉన్నా అభివృద్ధి జరగడం లేదు



ఆస్తుల రక్షణతో పాటు ఆస్తి పన్ను వసూల్‌కు నక్ష చేపట్టారు. గ్రేడ్ వన్ మునిసిపాలిటీ ప్రజలు ట్యాక్స్‌లు చెల్లిస్తున్నా పనులు సున్నాగా మారుతున్నాయి. సాంకేతిక విజ్ఞానం సామాన్య ప్రజల అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలి. నక్ష ప్రకారం గుర్తించబడిన ప్రభు త్వ స్థలాలను భవిష్యత్ అవసరాల కోసం పరిరక్షించాలి. ప్రైవేటు ఆస్తులు రక్షింపబడాలి

-రతన్‌సింగ్ నాయక్, ప్రకాశ్‌నగర్

హత్య కేసులో 17మందికి జీవిత ఖైదు

● ఒక్కొక్కరికి రూ.6వేలు జరిమానా ● 2017లో ప్రతీకార హత్యచేసిన 18మంది ● విచారణలో ఉండగా అనారోగ్యంతో ఒకరు మృతి ● తీర్పు చెప్పిన నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ, జిల్లా 2వ అదనపు జడ్జి

నల్లగొండ క్రైం/మోత్కూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో జరిగిన ఓ హత్య కేసులో 17మందికి జీవితఖైదు, ఒక్కొక్కరికి రూ.6వేల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. 2017 సంవత్సరంలో ఆజీంపేట గ్రామంలో జరిగిన ప్రతీకార హత్యకేసులో 18మంది నిందితుల్లో ఒకరు అనారోగ్యంతో మృతిచెందగా, 17మందికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ జిల్లా రెండో అదనపు జడ్జీ రోజారమణి మంగళవారం తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

ప్రతీకార హత్య జరిగిందిలా

ఆజీంపేట గ్రామానికి చెందిన బట్ట లింగయ్య(55) అదే గ్రామంలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన రాజమల్లు అనే వ్యక్తి మృతికి కారణమై జైలుకెళ్లి బెయిలుపై బయటకువచ్చాడు. 2017లో దసరా పండుగ సందర్భంగా బట్ట లింగయ్య కుటుంబంతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొనడానికి వెళుతున్న క్రమంలో లింగయ్య కారణంగా మృతిచెందిన రాజమల్లు కుటుంబ సభ్యులు, ఇతరులకు ఎదురుపడ్డాడు. ఆ పాత కక్షలను మనసులో పెట్టుకుని వారు లింగయ్యపై విచక్షణారహితంగా దాడి చేసి కొట్టి, పొలంలో తొక్కి చంపారు. దాంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా సమాచారం తెలుసుకున్న అడ్డగూడూరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతుడు లింగయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 18మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ప్రస్తుత ఖమ్మం జిల్లా ఇంటలిజెన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న రమేష్ ఆనాడు ఏసీపీ హోదాలో ఈ కేసు విచారణ చేపట్టారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా పాక నరేందర్ వ్యవహరించగా బాధితుల తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.అఖిల వాదనలు వినిపించారు. కేసు విచారణలో ఉండగానే నిందితుల్లో ఒకరైన జక్కుల బిక్షమయ్య మృతి చెందాడు. సాక్షుల విచారణలో నేరం రుజువు కావడంతో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జీ రోజారమణి మంగళవారం నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.6వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కన్నీటి పర్యంతమైన నిందితులు

మృతుడు లింగయ్య కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు 18 మందిపై 2017సంవత్సరం అక్టోబరు 30వ తేదీన కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరచగా 45రోజుల జైలు శిక్ష అనంతరం బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. సుమారు ఎనిమిదేళ్ల పాటు కోర్టు వాయిదాలకు హాజరవుతూనే ఉన్నారు. తీర్పు విన్న వెంటనే నిందితులు కన్నీటి పర్యంతమయ్యారు. శిక్ష పడిన అనంతరం నిందితులను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుంటున్న క్రమంలో శిక్షపడిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు వారిని పట్టుకుని బోరున విలపించారు. న్యాయస్థానం కావడంతో తమ వారిని కౌగిలించుకుని ఉబికి వస్తున్న దుఃఖంతో కన్నీటి పర్యంతమయ్యారు.



కోర్టు తీర్పు అనంతరం నిందితులను నల్లగొండ కోర్టు నుంచి జైలుకు తరలిస్తున్న పోలీసులు



కోర్టు తీర్పు అనంతరం నిందితులను వాహనంలో నల్లగొండ కోర్టు నుంచి జైలుకు తరలిస్తున్న పోలీసులు



రోదిస్తున్న బంధువులు

యావజ్జీవ శిక్ష పడిన 17మంది వీరే..

నిందితుల్లో ఏ-8 జక్కుల భిక్షమయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. యావజ్జీవ కారాగార శిక్ష పడిన వారిలో ఒక మాజీ సర్పంచ్ ఉండగా, ఎనిమిది మంది నిందితులు 30 ఏళ్ల లోపు వయస్సువారే ఉన్నారు. శిక్ష పడిన వారిలో అడ్డగూడూరు మండలం ఆజీంపేట గ్రామానికి చెందిన పండుగ రామస్వామి, పండుగ సాయిలు, పండుగ రాములు, పండగ మల్లేష్ (విద్యార్థి), బండగొర్ల వలరాజు, పండుగ యాదయ్య, జక్కుల రమేష్, పండుగ శ్రీకాంత్ (విద్యార్థి), పండుగ సతీష్, పండగ నర్సయ్య, పండుగ సత్యనారాయణ, బండగోర్ల నాగమ్మ, పండుగ శ్రీను, పండుగ మల్లయ్య, పండుగ లింగయ్య, జక్కుల లచ్చయ్య, ఆజీంపేట మాజీ సర్పంచ్ కాంగ్రెస్ అడ్డగూడూరు మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యలను నల్లగొండ జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.

శిక్ష పడిన వారిలో ఒకే కుటుంబానికి చెందినవారు ఇలా..

పండుగ నరసయ్య, పండుగ సాయిలు, పండుగ రాములు అన్నదమ్ములు కాగా, బండగొర్ల నాగమ్మ, బండగొర్ల వాల్‌రాజులు పండుగ నరసయ్యకు కుమార్తె, అల్లుడు అవుతారు. పండుగ సతీష్, పండుగ మల్లేష్‌లు (విద్యార్థి) పండుగ రాములుకు కుమారులు అవుతారు. పండుగ శ్రీను, పండుగ మల్లయ్య, పండుగ లింగయ్య సోదరులు అవుతారు. జక్కుల లచ్చయ్య, జక్కుల రమేష్ తండ్రీకుమారులు అవుతారు

నల్లగొండలో కోర్టు పరిసరాల్లో బందోబస్తు

ఇటీవల రంగారెడ్డి జిల్లా కోర్టులో ఓ కేసు తీర్పు వెల్లడించిన అనంతరం నిందితుడు న్యాయమూర్తిపై దాడి చేసేందుకు యత్నించిన ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. నల్లగొండ ట్రాఫిక్ సీఐ రాజు, ఎస్ఐ విజయ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేసుకు సంబంధించి తుది తీర్పు మంగళవారం రానున్ననేపథ్యంలో నిందితులంతా తమ ఇళ్ల వద్ద నుంచే నేరుగా నల్లగొండ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి తుది తీర్పు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయగా న్యాయమూర్తి నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునివ్వడంతో శిక్షపడిన వారు కన్నీటిపర్యంతమయ్యారు.

ఆజీంపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు

ఆజీంపేటలో 17మందికి జీవిత ఖైదు శిక్ష పడినందున గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి గ్రామానికి వచ్చి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. అడ్డగూడూరు, మోత్కూరు, వలిగొండ ఎస్ఐలు డి.నాగరాజు, డి.నాగరాజు, వి.యుగంధర్‌తోపాటు కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొన్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

ఎట్టకేలకు న్యాయం గెలిచింది.: బట్టు యాదమ్మ, హతుని భార్య



సుమారు ఏడేళ్ల తర్వాత నాకు న్యాయం జరిగింది. నా భర్తను అన్యాయంగా వారు పొట్టనబెట్టుకున్నారు. నా భర్తను హత్య చేయడంతో కుటుంబ పెద్దను కోల్పోయి నా కుటుంబం రోడ్డున పడింది. ఎట్టకేలకు న్యాయం గెలిచింది.

భర్త హత్య కేసులో మరో ఐదుగురికి..

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ప్రియుడితో హత్యచేయించిన భార్యతో పాటు మరో నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ 3వ జిల్లా అదనపు జడ్జి మంగళవారం తీర్పుచెప్పారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని గంధవారిగూడేనికి చెందిన సోమ కేశవులు(36) బిల్డర్‌గా జీవనం సాగిస్తుండగా, ఆర్థిక వ్యవహారాలు భార్య స్వాతి పర్యవేక్షిస్తుంది.

ఈ నేపథ్యంలో భార్య స్వాతికి పట్టణానికి చెందిన దుబ్బ ప్రదీప్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ప్రదీప్ సీసీ కెమెరాల వ్యాపారం నిర్వహిస్తుండగా, అతడికి ఓ బుల్లెట్ వాహనం కొనుగోలు చేసి ఇచ్చింది. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి సోమ కేశవులును అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు దుబ్బ ప్రదీప్ అతని స్నేహితులు పట్టణానికి చెందిన కొడిదేటి శివకుమార్, కుంభం ప్రసాద్, చింతపల్లి నగేష్‌తో కలిసి స్వాతి పథకం పన్నింది.

హత్య చేసేందుకు రూ.2లక్షల సుపారీ

ప్రదీప్ స్నేహితుడైన శివకుమార్‌తో రూ.2లక్షల సుపారీ మాట్లాడుకుని హత్య చేసేందుకు ప్రణాళిక రచించారు. అందులో భాగంగా 2019వ సంవత్సరం జూలై 1వ తేదీన గంధవారిగూడెంలో స్వాతి ప్రియుడు ప్రదీప్ నిర్మిస్తున్న కొత్త ఇంటి పైన స్నేహితులతో కలిసి రాత్రి వరకు మద్యం తాగారు. స్వాతి అర్ధరాత్రి సమయంలో ఆమె భర్త కేశవులు హాల్లో నిద్రిస్తున్న సమయంలో ఆమె ఇంటి వైపు వెనుక ఉన్న గేటును తెరిచి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ప్రదీప్‌కు సమాచారం అందించింది. వెంటనే ప్రదీప్, అతని మిత్రులు కలిసి ఇంటి వెనుక గేటు నుంచి ఇంట్లోకి వచ్చి హాల్లో నిద్రిస్తున్న కేశవులు చాతిపై సుత్తితో బలంగా మోది హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని హాలులో నుంచి వరండాలోకి తీసుకువచ్చి పడవేశారు.





భర్త హత్యకేసులో భార్య, ప్రియుడిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఆనవాళ్లు తెలియకుండా చేసే యత్నం

ఎవరికీ అనుమానం రాకుండా హాల్‌తో పాటు వరండాలో కూడా కారం చల్లి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. తెల్లవారుజామున కేశవులు భార్య స్వాతి తన భర్తను గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు దోచుకునేందుకు ఇంట్లోకి వచ్చి భర్తను హత్య చేశారని విలపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. మరుసటి రోజు కేశవులు తండ్రి నాగులు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతరం సరైన ఆధారాలు కోర్టుకు సమర్పించారు. మంగళవారం జిల్లా న్యాయస్థానంలో విచారణ అనంతరం నిందితులకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి దుర్గాప్రసాద్ తీర్పు వెల్లడించారు. కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు అందజేసి నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు చేసిన విచారణ అధికారి నిగిడాల సురేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ప్రస్తుత సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ప్రాసిక్యూషన్ తరుపున పీపీ జి.జవహర్‌లాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు వి.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లైజనింగ్ ఆఫీసర్లు హెచ్‌సీ పాక నరేందర్, పీసీ మల్లికార్జున్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	536.80
టీఎంసీలు	181.1714
ఎడమకాల్వకు నీటి విడుదల	8.108
కుడికాల్వకు	10.000
విద్యుత్ కేంద్రం ద్వారా	12.428
క్రస్ట్ గేట్ల ద్వారా	00000
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2.200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	280 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	32.816 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	45.820 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	636.68 అడుగులు
టీఎంసీలు	2.51
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	46.49 క్యూసెక్కులు

డ్రోన్ ద్వారా తెమడ సేకరణ

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలనలో భాగంగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ సైన్సెస్ (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా స్పూటం (కళ్లె లేదా తెమడ) శ్యాంపిల్స్ సేకరణ ఆరోగ్య శాఖ ప్రారంభించింది. క్షయ వ్యాధి లక్షణాలతో బాధపడేవారి నుంచి తెమడ నమూనాలు సేకరించేందుకు డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం శ్యాంపిల్స్ సేకరించి 15నిమిషాల్లో 25కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లాకేంద్రంలోని టీబీ కేంద్రానికి డ్రోన్ ద్వారా తరలించారు.

సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పీఏసీఎస్‌లు, బ్రాంచీలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్, ప్రజాప్రతినిధులు మంగళవారం కలిసి పీఏసీఎస్‌లు, డీసీసీబీల పాలకవర్గాల గడువు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సహకార బ్యాంకుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గడువు పెంచడంతో బ్యాంకులు మరింత అభివృద్ధిని చెందనున్నాయి. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు అభివృద్ధి చెందడంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉందన్నారు. డిపాజిట్ల సేకరణ పెంచడంతో పాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను పెద్దఎత్తున అందిస్తున్నామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీసీసీబీ చైర్మన్లను ఉద్దేశించి మాట్లాడుతూ సహకార బ్యాంకులు రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. వివిధ జిల్లాల చైర్మన్లు పాల్గొన్నారు.

చర్లగూడెం రిజర్వాయర్ పనులు అడ్డగింత



పనులు అడ్డుకుంటున్న నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు

మర్రిగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్, పునరావాసం కల్పించాలని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు చర్లగూడ రిజర్వాయర్ పనులను అడ్డుకున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వా యర్ కట్ట నిర్మాణ పనులు చేపడుతుండా భూ నిర్వాసితులు పునరావాసం కల్పించకుండా పనులు నిర్వహిస్తున్నారని, మా సమస్యలు పరిష్కరించే వరకు పనులు నిలిపివేయాలన్నారు. నెల రోజులు అయిన 32మందికి పునరావాసం కల్పించకుండా మరికొంత మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించకుండా కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఇప్పటికే భూములను కోల్పోయామన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వంఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లిస్తుందని పనులు జరిగేలా చూడాలని బాధితులకు సూచించారు. ఎంత నచ్చజెప్పిన కూడా భూ నిర్వాసితులు యంత్రాలతో పని జరగకుండా అడ్డుకున్నారు. ఎస్ఐ కృష్ణారెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వారం రోజుల్లో అర్హులైన వారికి పునరావాసం కల్పించడానికి అధికారులు చూస్తున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి కూడ తీసుకెళ్లడం జరిగిందని పనులకు సహకరించాలని వారికి నచ్చజెప్పారు. అనంతరం బాధిత భూ నిర్వాసితులు ఎస్ఐ ఇచ్చిన హామీకి మేరకు పనులకు అంగీకరించారు.ఈ కార్యక్రమంలో పలువురు భూ నిర్వాసితులు ఉన్నారు.

నేటినుంచి యాద'గిరి'పై సంప్రోక్షణ మహోత్సవాలు





సంప్రోక్షణ మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న అర్చకులు, కొండపై ప్రత్యేకంగా రూపొందించిన మండపం

(5వ పేజీ తరువాయి)

ఆలయ ఉత్తర తిరువీధిలో ఏర్పాటుచేసిన యాగశాలలో హోమాలు చేపట్టనున్నారు. తొలిరాజు ఆలయంలోని ఆస్థాన మండపంలో ఉదయం 7.45గంటలకు మహాకుంభాభిషేకం దిగ్విజయం చేసేందుకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్స్యంగ్రహణం వైభవంగా నిర్వహిస్తారు. వివిధ మంత్ర పఠనం గావిస్తూ సముద్రాలు, నదులను ఆవాహన చేస్తూ యజ్ఞకుండాల్లో ఆవాహన చేసి యాగాన్ని ప్రారంభిస్తారు. నవధాన్యాలతో లక్ష్మీదేవిని ఆహ్వానించి అంకురార్పణ చేస్తారు.

దేవతామూర్తులకు అవిస్సులు

ఆలయ ఉత్తర తిరువీధిలో తూర్పు వాసుదేవ కుండం, దక్షిణం ప్రద్యుమ్న కుండం, పశ్చిమం సంకర్షణ కుండం, ఉత్తరం అనిరుద్ధ కుండం, ఈశాన్యంలో మహాలక్ష్మీకుండంతో ఐదు హోమకుండాలు ఏర్పాటు చేశారు. వీటిలో అగ్నిమథనం చేసి నరసింహ, సుదర్శన, గరుత్మంతుడు, లక్ష్మీదేవి మంత్రాలు, దివ్య విమాన రాజగోపురంలోని దేవతలకు అవిస్సులు అందజేస్తారు. అనంతరం స్వామివారిని ఆవాహన చేసి ప్రతిష్ఠించి యజుర్వేదాలు 108 మంది రుత్వికులు పఠించనున్నారు. 60మంది రుత్వికులు లక్ష్మీ, నరసింహ, సుదర్శన, రామాయణం, భాగవతం, మూల మంత్ర హవనాలు, మూల మంత్ర జపాలతో పాటు ఉదయం సాయంత్రం విష్ణు సహస్రనామాలు, నరసింహ, రామాయణం, భాగవత పారాయణాలతో పాటు అభిషేకాలు ఈ నెల 22 వరకు నిర్వహిస్తారు. చివరి రోజు దిష్టికుంభం, నైవేద్యం, గుమ్మడికాయ, కొబ్బరికాయ సమర్పించి స్వర్ణ దివ్య విమాన రాజగోపురానికి మహా కుంభాభిషేకం కలశంతో వేడుకలు నిర్వహించనున్నారు.

చివరి రోజు ప్రత్యేకం

మహాకుంభాభిషేక ఘట్టంలో చివరి రోజు 23వ తేదీన ఉదయం 9గంటలకు మహాపూర్ణాహుతి, వేదశాత్తుముఱై, 11.54గంటలకు మూల నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన స్వామివారి దివ్య బంగారు గోపురం మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం వైభవంగా చేపట్టనున్నారు. మహా రాజభోగ నివేదన, పెరియ శాత్తుముఱైతో పాటు సాయంత్రం ఆస్థాన మండపంలో శాంతి కల్యాణం నిర్వహిస్తారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు 1001 తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు.

స్వామిని దర్శించుకున్న ఫ్రాన్స్ దేశస్థులు

స్వయంభువులను ఎమ్మెల్సీ శంభీపురం రాజు, ఫ్రాన్స్ దేశానికి చెందిన క్రిస్టీయన్, పాస్కెల్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేద మండపంలో వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్భుత శిల్పాకళా సంపదతో ఆలయం నిర్మితమైందన్నారు. శిల్పుల నైపుణ్యం శిల్పాలకు జీవం పోసిందన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవో

శాలిగౌరారం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన శాలిగౌరారం ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి మంగళవారం విధుల్లో చేరారు. గత సంవత్సరం డిసెంబరు 18న ఆమె సెలవుపై వెళ్లడంతో నార్కట్‌పల్లి ఎంపీవో బానోతు సుధాకర్‌కు శాలిగౌరారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నుంచి జ్యోతిలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

వీరభద్రయ్యకు సేవా రతన్ అవార్డు

శాలిగౌరారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన అమ్మ జ్యోతి అనాథ ఆశ్రయం ఫౌండేషన్ నిర్వాహకులు బీమనబోయిన వీరభద్రయ్యకు సేవా రతన్ అవార్డు లభించింది. వీరభద్రయ్య ఐదు సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో అమ్మ జ్యోతి అనాథ ఆశ్రమం నడిపిస్తూ అనాథ పిల్లలకు, వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వండి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరిన ఎమ్మెల్యే వేముల వీరేశం


సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. హైద్రాబాద్‌లో మంగళవారం సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే సీఎం దృష్టికి తెచ్చారు. నియోజకవర్గంలో చేపట్టిన, కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పలు అభివృద్ధి పనుల కోసం నిధులను కేటాయించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'భూ భారతి' సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మర్రిగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భూ భారతిలో ఉన్న పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ పాండురంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భూభారతి లాగిన్ కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నీలకంఠ రాములు, రియాజోద్దీన్, పాండు, ఎల్లమ్మ ఉన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు సజావుగా అందేలా చూస్తాం


శివ ప్రసాద్‌ను సన్మానిస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు సజావుగా అందేలా చూస్తామని ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజీవ్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త అధికారి డాక్టర్ బానోత్ శివ ప్రసాద్ అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త అధికారిగా బాధ్యతలు స్వీక రించిన శివ ప్రసాద్‌ను తెలంగాణ రాష్ట్ర రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గిరి యాదయ్య, జిల్లా ఆరోగ్యశ్రీ ఉద్యోగులు మంగళ వారం కలిశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పథకం అమలులో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు గోలి నాగరాజు, బురుగు సైదులు, నరేష్‌కుమార్, గోవిందరెడ్డి, మల్లయ్య, రోజ, రాధ , ఏమిరెడ్డి లక్ష్మీ, వరలక్ష్మీ, సరిత తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం


నకిరేకల్‌లో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నకిరేకల్, ఫిబ్రవరి 18,(ఆంధ్రజ్యోతి): పెద్దగట్టు జాతరకు వెళ్తున్న భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంగళవారం నకిరేకల్ బైపాస్‌లో జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆమె వెంట మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, షీప్ అండ్ గోట్ రాష్ట్ర మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, చెరుకు లక్ష్మి, గాదె శివ, పెండెం సంతోష్, సంపత్, వెంకటేష్, పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: పెద్దగట్టు జాతరకు వెళ్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ఘన స్వాగతం పలికారు. యువజన విభాగం మండల అధ్యక్షుడు పుల్లెంల వెంకట్, నడింపల్లి మహేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రీయ శివాజీ సేన మండల అధ్యక్షుడిగా శివకుమార్



నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ శివాజీ సేన మండల అధ్యక్షుడిగా మండలంలోని ఎల్లారెడ్డి గూడేనికి చెందిన తాడోజు శివకుమార్ నియామకమయ్యారు. సంఘం వ్యవ స్థాపక అధ్యక్షుడు తాడోజు శ్రీనివాసచారి మంగళవారం నియామక పత్రం అందజేశారు.

ఇసుక తోడేస్తున్నారు..!

● అమ్మనబోలు నుంచి ఆగని ఇసుక తరలింపు ● పరిశీలనలోనే ఇసుక రీచ్‌ల గుర్తింపు ● వరద నీరు రాక ఇసుక లభ్యత లేని నకిరేకల్ చందుపట్ల వాగు


అమ్మనబోలు మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడంలేదు. సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు కూడా పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో మూసీ పరివాహక ప్రాంతం ఉంది. చిట్యాల మండలం మినహా రామన్నపేట, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్ కేతేపల్లి మండలాల్లో మూసీ నీరు ప్రవహిస్తున్నా ఎక్కువగా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు, కేతేపల్లి మండలాల్లోని భీమారం, కాసనగోడు గ్రామాల్లో ఇసుక అక్రమంగా తరలుతోంది. ప్రభుత్వ నిర్మాణాలకే అనుమతి ఉన్నా ప్రైవేట్ వ్యక్తులకు కూడా ఈ పై గ్రామాల నుంచి ఇసుక రవాణా జరుగుతోందన్న ఫిర్యాదులు లేకపోలేవు.

ఆంధ్రజ్యోతి విజిట్

పరిశీలనలోనే రీచ్‌ల ప్రతిపాదనలు

అమ్మనబోలులో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు ప్రయత్నించారు. అమ్మనబోలు మూసీ వాగును ఇసుక రీచ్‌గా గుర్తిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు దళారీల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించారు. ఈ మేరకు కలెక్టర్‌కు అందజేశారు. ఇటీవలే సంబంధిత రెవెన్యూ, మైనింగ్, భూగర్భ జలవనరులు, నీటి పారుదల శాఖ అధికారులు సందర్శించి తమ శాఖలకు సంబంధించిన నివేదికలను కలెక్టర్‌కు అందజేశారు. ఇసుక రీచ్ ఏర్పాటుకు అనుకూలంగానే అధికారులు నివేదిక ఇచ్చారని తెలిసింది. కానీ ఈ నివేదిక ఇంకా కలెక్టర్ తన పరిశీలనలోనే ఉంచారు. దీంతో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. కేతేపల్లి మండలంలోని మూసీ పరి వాహక ప్రాంతాలైన భీమారం, కాసనగోడు గ్రామాల నుంచి గతంలో ఇసుక అక్రమ రవాణా జరిగేది. అక్రమ రవాణాపై ఫిర్యాదులు వచ్చిన కొద్ది రోజులు పాటు ఇసుక రవాణాను నిలిపివేయడం తదుపరి కొనసాగించడం రివాజుగా ఉండేది. ఐతే గతేడాది ఈ రెండు గ్రామాల్లోని మూసీ వాగు వద్ద నీటి నిల్వల కోసం నిర్మించిన చెక్‌డ్యాంలతో నీరునిలిచి కొంత ఇసుక అక్రమ తవ్వకానికి అవకాశం లేకుండా పోయింది.

వాగు ఎండడంతో తగ్గిన ఇసుక నిల్వలు

నకిరేకల్ మండలంలోని చందుపట్ల వాగులో గతంలో ఇసుక అక్రమ రవాణా కొనసాగేది. వర్షాలు బాగా కురిసి వరద నీటి రాకతో ఇసుక మేటలు ఏర్పడేవి. దీంతో ఇసుక మాఫియా చందుపట్ల వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకునేది. వర్షాలులేక వరద నీరు తగ్గిపోయి ఉన్న ఇసుక నిల్వలు తగ్గిపోయాయి. ప్రస్తుతం నకిరేకల్‌వాసులకు వంగమర్తి తదితర గ్రామాల నుంచి ఇసుక చేరవేస్తున్నారు.

ఇసుక రీచ్‌లుగా గుర్తించాలి



మూసీ వాగు నుంచి నియోజవవర్గ వ్యాప్తంగా ఇసుక దోపిడీకి గురవుతోంది. ఇసుక మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. ఇసుక లభ్యత ఉన్న వాగులను రీచ్‌లుగా గుర్తిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అమ్మనబోలు వాగును ఇసుక రీచ్‌గా గుర్తించాలి. ఈ విషయంపై ఉన్నతాధికారులు కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలి.

● ఎనుగుల రవీందర్‌రెడ్డి,

ఈ నెల 20న నిర్ణయం రావొచ్చు



అమ్మనబోలు మూసీ వాగును రీచ్‌గా గుర్తించే ప్రతిపాదనలు ఇంకా పరిశీలనలోనే ఉన్నాయి. అన్ని సంబంధిత విభాగాల అధికారులు సందర్శించి వేర్వేరుగా తమ నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈనెల 20న జరగనున్న సమావేశంలో అమ్మనబోలు ఇసుక రీచ్‌పై ఓ నిర్ణయం రావచ్చు. .

● వెంకటేశ్వర్‌రావు, ఏడీ మైన్స్, నల్లగొండ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలందరూ ఏకం కావాలి : జాజుల


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్, ఫిబ్రవరి 18,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పెద్దగట్టు జాతరకు వెళ్లి హైదరాబాద్‌కు వెళ్తు నకిరేకల్‌లో మంగళవారం రాత్రి జరిగిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీసీలను గెలిపించి బడుగుల ఆత్మగౌరవాన్ని కాపాడి రెడ్ల ఆధిపత్యాన్ని అణచివేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు రెడ్లు, బీసీల మధ్యనే జరుగుతుందన్నారు. బీసీలందరూ ఏకం కావాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అర్రూరి వెంకటేశ్వర్లు, పాపని వెంకటరమణ, జటంగి వెంకటనర్సయ్య, రవియాదవ్, రాచకొండ వెంకన్న, మురళి, చామల నర్సయ్య, తాటికొండ విక్రమ్, కణకాల శ్యామ్‌కుమార్, సింగం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన మిరప సాగు

(5వ పేజీ తరువాయి)



వరకు చెల్లించాలి. మొత్తంగా ఎకరా మిర్చి సాగుకు రైతుకు మొత్తం రూ.3.25లక్షలు పెట్టుబడి అవుతోంది. ఎకరా సాగుకు దిగుబడి 25 క్వింటాళ్లు వస్తుండగా, ప్రస్తుత మార్కెట్ ధర రూ.12,800 నుంచి రూ.14,000 చొప్పున రూ.3.20లక్షల నుంచి రూ.3.50లక్షలు మిర్చి విక్రయిస్తే రైతుల చేతికి అందుతోంది. పెట్టుబడి రూ.3.25లక్షలు పోగా క్వింటాకు రూ.12వేల ధర లభిస్తే రైతుకు రూ.5వేలు నష్టం వాటిల్లుతుంది. క్వింటాకు రూ.14వేలు ధర పలికితే రైతకు కేవలం రూ.25వేలు మాత్రమే మిగులుబాటు ఉంటుంది. కౌలు రైతు అయితే ఎకరానికి రూ.10వేలు కౌలు అదనం. వీరికి మిగిలేది శూన్యం.

దిగుబడులు, ధర లేక దిగాలు

మిరపకు ఈ ఏడాది తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. వరుస తెగుళ్లతో వారానికోసారి మందులు పిచికారీ చేయాల్సి రావడంతో రైతులు ఆర్థిభారం మోశారు. 10 నెలల పంట కాలంలో పెట్టుబడులు పెరగడంతో చాలా వరకు 9నెలల ముందేను రైతులు పంటను వదిలేస్తున్నారు. గత ఏడాది 40క్వింటాళ్ల దిగుబడులు రాగా, ఈ ఏడాది ఎకరానికి 20-25 క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా క్వింటాకు రూ.18-21వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది మిర్చి సాగు పెరగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గిపోవడంతో ప్రస్తుతం క్వింటాకు రూ.12వేల నుంచి రూ.14వేల ధరతో భారీగా నష్టాలు వచ్చినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : నాగం


ప్రచారం నిర్వహిస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు

నల్లగొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమరెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే బీజేపీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ కోరారు. మండలంలోని ముష్టిపల్లి పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సంఘం టీపీఎయూఎస్ బలపర్చిన అభ్యర్థి సర్వోత్తమరెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలగోని శ్రీకాంత్‌గౌడ్, పంగ లింగస్వామి, సురేష్ పాల్గొన్నారు.

కొబ్బరికాయలు కొట్టి.. బోనాలు సమర్పించి


మూసీ నదిలో ఏర్పాటు చేసిన భక్తుల గుడారాలు

కేతేపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూసీ నదిలో గంగా భవాని ఉత్సవాలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. దురాజ్‌పల్లి జాతరలో తమ ఆరాధ్య దైవం లింగమంతుల స్వామిని దర్శించుకున్న యాదవులు తిరుగు ప్రయణంలో కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులోని మూసీ నదిలో పుణ్యస్నానాలు చేసి అక్కడే ఉన్న రామాలయం, గంగదేవమ్మ తల్లికి పూజలు చేస్తారు. మూసీ నది ఒడ్డున గల గంగదేవమ్మ తల్లి గుడి వద్ద జీవాలను బలి ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి, బోనాలు సమర్పిస్తారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం సాయంత్రం నుంచే గంగదేవమ్మ గుడికి ఆరంభమైన భక్తుల చేరిక మంగళవారం మరింత పెరిగింది. ఉప్పలపహాడ్ బస్‌స్టేజీ సమీపంలో, మూసీ నది ఒడ్డున, మూసీ నదిపై గల పాత, కొత్త వంతెనల కింద స్థావరాలు ఏర్పాటు చేసుకుని వంటావార్పు చేసుకున్నారు. గంగదేవమ్మ గుడికి వెళ్ళే భక్తుల రద్దీ పెరగడంతో ఇక్కడ తినుబండారాలు, బోనం కుండల విక్రయ దుకాణాలతో పాటు మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. పరిసర గ్రామాలైన మండలంలోని ఉప్పలపహాడ్, సూర్యాపేట రూరల్ మండలంలోని టేకుమట్ల, ఎండ్లపల్లిలకు చెందిన బెల్టుషాపుల వ్యాపారులు బస్తాలు, కార్టన్లలో పెద్ద ఎత్తున మద్యం బాటిళ్ళు తెచ్చి ఉప్పలపహాడ్ బస్‌స్టేజీ వద్ద మిఠాయి, ఆటవస్తువుల దుకాణాలతో పాటుగా ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించారు.

గంగాదేవికి బోనాల సమర్పణ

చిట్యాలరూరల్: మండలంలోని నేరడ శివారులో పెద్దగట్టు దేవాలయం వద్ద జాతర ముగింపు సందర్భంగా మహిళలు గంగాదేవికి బోనాలు సమర్పించారు. భక్తులు ఆలయానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సాంప్రదాయంగా డోలును వాయిస్తూ భక్తులు లింగమంతులస్వామి వద్దకు చేరుకుని ఉత్సాహంతో డోలును వాయిస్తూ ఓ లింగా.. ఓ లింగా.. అంటూ నృత్యాలు చేశారు. మాణిక్యమ్మ, ఆకుమంచమ్మ, లింగమంతులస్వామి, ఎలమంచమ్మ, చౌడమ్మతల్లి, శ్రీగంగమ్మతల్లి, శ్రీరేణుక ఎల్లమ్మతల్లి దేవతలను దర్శించుకున్నారు. మహిళలు గంగాదేవి బోనాలను గుట్టపైకి తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను, నైవేద్యాన్ని సమర్పించారు. పెద్దగట్టుపై గంగాదేవికి భక్తులు బోనాలను సమర్పించడంతో జాతరను ముగించారు. జాతర ముగింపుతో దేవతామూర్తులను గర్భగుడిలోకి తరలించారు. లింగమంతులస్వామి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణానికి సహకరించిన గ్రామస్తుడైన ఎన్‌ఆర్‌ఐ దుబ్బాక అమరేందర్‌రెడ్డి, దుబ్బాక రజనీకాంత్‌రెడ్డిలను యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో చిరగోని సత్తయ్య, ఆవుల నర్సింహ, చిరగోని శ్రీశైలం, చిరగోని లింగస్వామి, వెంకటేష్, కడారి శంకర్, చిరగోని విజయ్‌కుమార్, కడారి శ్రీను, వల్లపు ముత్తయ్య, సాగర్ల వేణు, వల్లపు రమేష్, మెండె వెంకన్న, మాజీ కౌన్సిలర్, మాజీ ఎంపీటీసీ జడల పూలమ్మ, మెండె సుజాత, జడల చినమల్లయ్య, మెండె సైదులు, సాగర్ల గోవర్ధన్, బెల్లి సత్తయ్య, ఏళ్ళ మల్లేష్, మెండె నర్సింహ, జడల పూలమ్మ, మెండె సుజాత తదితరులు పాల్గొన్నారు.


చిట్యాల : నేరడ గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సబ్ డివిజన్ పరిధిలో రోడ్లు మంజూరు

● ఆర్‌అండ్‌బీ డీఈఈ సుధాకర్‌రెడ్డి



నకిరేకల్ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం కొత్తగా 10 రోడ్డు పనులు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ డీఈఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సబ్ డివిజన్‌లో మంజూరైన రోడ్ల, వాటి పనుల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● నార్కట్‌పల్లి (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: నకిరేకల్ సబ్ డివిజన్‌లో ఎన్ని రోడ్లు ఉన్నాయి

డీఈఈ: నకిరేకల్ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 34 ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి

ఆంధ్రజ్యోతి: సబ్ డివిజన్ పరిధిలోకి ఎన్ని మండలాలు వస్తాయి

డీఈఈ: సబ్ సడివిజన్ పరిధిలోకి మొత్తం ఏడు మండలాలు వస్తాయి. వీటిలో చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం, వేములపల్లిలో కొంత భాగం వస్తుంది.

ఆంధ్రజ్యోతి: సబ్ డివిజన్ పరిధిలో మొత్తం కిలో మీటర్ల రోడ్డు ఉన్నాయి.

డీఈఈ: సబ్ డివిజన్ మొత్తం 34 రోడ్లకు గాను 231 కిలో మీటర్ల నిడివి కలిగి ఉంది.

ఆంధ్రజ్యోతి: సబ్ డివిజన్ పరిధిలో కొత్తగా మంజూరైన రోడ్లెన్ని

డీఈఈ: సబ్ డివిజన్ పరిధిలో మొత్తం కొత్తగా 10 పనులు మంజూరయ్యాయి.

ఆంధ్రజ్యోతి: కొత్తగా మంజూరైన రోడ్డు పనుల విలువ ఎంత?

డీఈఈ: కొత్తగా మంజూరైన రోడ్ల పనుల విలువ సుమారు రూ.130.70 కోట్లు.

ఆంధ్రజ్యోతి: నార్కట్‌పల్లి పట్టణ రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయి

డీఈఈ: రూ.16 కోట్లతో చేపట్టిన నార్కట్‌పల్లి పట్టణ రోడ్డు విస్తరణ పనులను జూన్-2025 నాటికి పూర్తిచేస్తాం

ABC సమాచారం

టీటీడీ సభ్యుడు నర్సిరెడ్డిని కలిసిన నాయకులు


నర్సిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డిని జిల్లా తెలుగు దేశం పార్టీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఎల్వీ యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి నర్సిరెడ్డి సేవలను గుర్తించి బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండు వెంకటేశ్వర్లు, బక్కతోళ్ల ఇస్తారి, గోగుల నాగరాజు, గంగాధర్ స్వరాజ్, కంచనపల్లి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ఇన్‌చార్జి ఎంఈవోగా మల్లేశం

మునుగోడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండల ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి (ఎంఈవో)గా తల్లమల్ల మల్లేశం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కత్తుల రవీందర్ పదోన్నతిపై జిల్లా కార్యాలయంలో సెక్టోరియల్ ఆఫీసర్‌గా వెళ్లారు. మండలంలోని కొరటికల్ గ్రామ హైస్కూల్‌లో జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న మల్లేశంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ మండలంలో విద్యా అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ డీఈ సీహెచ్ విద్యాసాగర్ హెచ్చరించారు. మండలంలోని అంగడిపేట సబ్ స్టేషన్ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి మండల విద్యుత్ లైన్‌మెన్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు జరుగుతుండడంతో రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	190	210
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 19.0

కన్నీరు మిగిల్చిన మిరప సాగు



- వెంటాడిన తెగుళ్లు
- క్వింటాకు రూ.14వేల వరకు ధర
- ఎకరానికి రూ.3లక్షలకు పైగా పెట్టుబడులు
- నష్టాలబారిన రైతులు

మిర్యాలగూడ(వ్యవసాయం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎర్ర బంగారంగా పిలిచే మిరప సాగు రైతులకు కన్నీరు పెట్టిస్తోంది.. వాతావరణ మార్పులు, వరుస తెగుళ్లతో దిగుబడులు పడిపోగా, పెరిగిన పెట్టుబడులు, మార్కెట్లో మిరపకు ధర లేకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుపోయారు.

మిరప సాగులో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉంది. దేశంలో 8.72లక్షలు, రాష్ట్రంలో 3.63లక్షల ఎకరాల్లో మిరప సాగవుతోంది. రాష్ట్రంలో 6.54లక్షల టన్నుల మిరప ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 30వేల ఎకరాల్లో మిరప సాగవుతోంది.

సాగు భారం

జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో రైతులు ప్రధానంగా మిరప పంటను సాగు చేశారు. మూడేళ్లగా పంటలో నల్ల నల్లి వ్యాపించి ఆకు ముడత, దోమ, ఎర్ర నల్లి, జెమిని తెగులుతో పంట దెబ్బతింటోంది. మొక్క నాటు వేసిన దగ్గర నుంచి ప్రతి కూల వాతావరణ ప్రభావంతో ఆశించిన స్థాయిలో పంట ఎదుగుదల లేక దిగుబడులు పడిపోయాయి. ఎరువులు, పురుగు మందులు కూలీల ధరలు 50శాతం పెరగడంతో పెట్టుబడుల భారం అధికమైంది.

పెరిగిన పెట్టుబడులు

మెట్ట భూమి ఎకరా దున్నకానికి రైతుకు రూ.5వేల వరకు ఖర్చు వస్తోంది. మిర్చి విత్తనాలకు రూ.10వేలు వ్యయం అవుతోంది. పంటలో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుచేసి మొక్కలకు నీరందించేందుకు రూ.10వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఇక అడుగు పిండి (25బస్తాలు) వినియోగించాల్సి రావడంతో అందుకు సుమారు రూ.40వేలు ఖర్చవుతోంది. అంతర్ సేద్యం (6 సార్లు) రూ.6వేలు, కలుపు తీసివేత కూలి (5 సార్లు) రూ.4వేల వరకు రైతులకు వ్యయం అవుతోంది. మిర్చికి ఎక్కువగా పురుగు మందులు వాడాల్సి వస్తోంది. అందుకు మందులకు (9నెలల్లో 45-50సార్లు పిచికారీ) రూ.లక్షవరకు ఖర్చు వస్తోంది. ఇక పంట చేతికి వచ్చాక మిర్చి తీతకు ఒక్కో క్వింటాకు కూలీలకు రూ.6వేల చొప్పున ఎకరా భూమిలో వచ్చే 25క్వింటాళ్ల దిగుబడిరి రూ.1.50లక్షల

మిగతా 8వ పేజీలో...



తెగుళ్ల బారిన పడిన మిరపతోట

మిర్చి సాగుతో నష్టాలే



ఈ ఏడాది 10 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట వేశాను. పంట వేసిన దగ్గర నుంచి తెగుళ్ల వ్యాప్తి అధికమయింది, పెట్టుబడులు, కూలీల ఖర్చు పెరిగింది. దిగుబడులు బాగా తగ్గిపోయాయి. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పంట గిట్టుబాటు కాలేదు.. చేసిన కష్టం చేతికి రాలేదు.

కూన్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, పెద్దగూడెం, అనుముల మండలం



ఆలయం ఎదుట చంద్రపట్నం వేస్తున్న యాదవ పూజారులు

చంద్రపట్నాన్ని కళ్లకద్దుకుని..



బోనం ఎత్తుకున్న యువతి

- మూడో రోజూ పెద్దగట్టు జాతరకు పోటెత్తిన భక్తులు
- ఉదయం అంతంతమాత్రంగా, సాయంత్రానికి పెద్దసంఖ్యలో భక్తుల రాక
- స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ, జాగృతి నాయకురాలు కవిత

పెద్దగట్టు జాతరలో భాగంగా రెండో ప్రధాన ఘట్టం చంద్రపట్నం కార్యక్రమం ముగిసింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. చంద్రపట్నాన్ని దర్శించుకుని కళ్లకద్దుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. భేరీ చప్పుళ్లు, కరారీ విన్యాసాల మధ్య గంపల ప్రదక్షిణలు, మొక్కుల చెల్లింపులు పూర్తి చేసుకున్నారు.

వివరాలు 6వ పేజీలో



ఉత్సవాలకు సిద్ధమైన యాదగిరీశుడి దేవాలయం

నేటినుంచి యాద'గిరి'పై సంప్రోక్షణ మహోత్సవాలు

- 23న ఉదయం 11.54గంటలకు మహాకుంభాభిషేకం
- దివ్య విమాన బంగారు (గాలి) గోపురం ఆవిష్కృతం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

యాదాద్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బంగారు విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం బుధవారం (ఈ నెల 19నుంచి) ప్రారంభంకానుంది. హోమాలు, జపాలు, హవనాలు, వేదాలు, పారాయణాలతో ఉదయం 11.54గంటలకు మహాకుంభ సంప్రోక్షణతో దివ్య విమాన బంగారు(గాలి) గోపురం ఆవిష్కృతం కానుంది. దేశంలోనే 50.5అడుగుల పంచతల గోపురం తొడుగుల 10,753.39చదరపు అడుగుల కోసం సుమారు 68.84కిలోల బంగారం వినియోగించారు. ఈ మహోత్సవాన్ని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కాగా, 2024 నవంబరు 6న స్థానిక ఆచార్యులు కళావరోహణ చేయగా ఈ నెల 23న మహాకుంభాభిషేకంతో కళారోహణ చేపట్టడంతో క్రతువు ముగుస్తుంది. ఈ వేడుకలు వానమామలై 31వ మధుర పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ అధ్యాత్మిక పండుగ కొనసాగనుంది.

యాగశాలలో హోమాలు

ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు సారథ్యంలో అర్చక బృందం

మిగతా 7వ పేజీలో..

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

సీఎస్ శాంతికుమారి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతీ రోజు ఫీడర్ వారీగా విద్యుత్ సరఫరాను సమీక్షించాలని, ఎక్కడైనా ట్రిప్ అయితే తిరిగి పునరుద్ధరించేందుకు ఎంత సమయం పడుతుందో విశ్లేషించాలన్నారు. తాగునీటి పథకాలకు, ఆస్పత్రులకు విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై పత్రికల్లో వచ్చే వార్తలకు తక్షణం స్పందించి ప్రజలకు ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా విషయాన్ని వివరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, గత ఏడాది విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. దేవరకొండ ప్రాంతంలో అదనపు ఫీడర్ ఏర్పాటుకు గుర్తించామన్నారు. గత రెండేళ్ల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఎనిమిది శాతం అదనపు లోడ్‌ను సైతం తట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. ప్రతీ రోజు విద్యుత్ సరఫరాను పర్యవేక్షించేందుకు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





నల్లగొండ మునిసిపాలిటీలో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

నీటి ఎద్దడిని నివారించాలి

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి ప్రారంభమైనందున ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని వార్డు అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. గత ఏడాది నీటి డిమాండ్ ఆధారంగా ఈ ఏడాది తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఓవర్ హెడ్, మంచి నీటి ట్యాంకులన్నింటినీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలన్నారు. మున్సిపల్ శివారు కాలనీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాతో అంతరాయం కలిగితే దీన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వార్డు ఆఫీసర్లు లేదా సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించాలన్నారు. వీధి దీపాల ద్వారా విద్యుత్ ఆదా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవం కింద నాటిన మొక్కలు వేసవి ఎండల కారణంగా చనిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీరు పోయాలన్నారు. ఇటీవల వీఆర్వోలను వార్డు ఆఫీసర్లుగా నియమించినందున పని విధానాన్ని తెలుసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెంచేందుకు సిబ్బంది సమష్టిగా పనిచేయాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మిల్లర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాన్ని నూరుశాతం సాధించేందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేసా రవి, డాక్టర్ గీతావాణి, డాక్టర్ అరుంధతి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్

ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధం చేయాలి

గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్

కట్టంగూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆధారంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20నాటికి అన్ని గ్రామాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా తయారు చేయడంతో పాటు నమునా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు అందించే రూ.5లక్షల ఆర్థిక సాయం నాలుగు విడతలుగా చెల్లింపులు ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో చింతమల్ల చలపతి, పంచాయతీ కార్యదర్శులు వడ్లకొండ అశోక్, శ్రీధర్‌రెడ్డి, జయసుధ, రేణుక, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా రమేష్

నల్లగొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా జీవీ.రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి జేడీగా ఉన్న ఖాద్రీ నుంచి ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. రమేష్ నాగర్‌కర్నూల్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ, పదోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన బుధవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

'పౌర హక్కులకు సంకెళ్లు వేస్తున్న అమెరికా'

హాలియా, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు ఏజెంట్ల ద్వారా వెళ్లి మోసపోయిన భారతీయులను యుద్ధ ఖైదీలుగా సంకెళ్ల వేసి వెళ్లగొడుతుంటే ప్రధాని మోదీ తమాషాగా ట్రంప్‌తో స్నేహం చేయడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపి భారతీయులను తీసుకువచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని మోదీ అమెరికాలో ఉంటున్న భారత పౌరులను గౌరవంగా తీసుకురావడానికి ట్రంప్‌తో మాట్లాడేందుకు ఎందుకు చొరవ చేయడం లేదన్నారు. దేశ ప్రజలతో అవమానకరంగా వ్యవహరిస్తుంటే బీజేపీ నాయకులు, మంత్రులు, ఎంపీలు ట్రంప్ చర్యలను సమర్థించడం దుర్మార్గమన్నారు. పౌర హక్కులకు సంకెళ్లువేస్తున్న అమెరికాను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అవుతా సైదులు, రెబెల్లి వెంకటేశ్వర్లు, ఆవుల రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



దామరచర్లలో వన నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ వై.శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పచ్చునాయక్‌తండా, బెట్టెతండా, తాళ్లవీరప్పగూడెం, వీర్లపాలెం, దామరచర్ల గ్రామాల్లోని నర్సరీలను ఆయన తనిఖీ చేసిన మాట్లాడారు. మొక్కల ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మూర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిస్టుల ఐక్యం ఎంతో అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

ఎంసీపీఐ(యు) ఆలిండియా కార్యదర్శి అశోక్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో సామాజిక. సాంస్కృతిక, ఆర్థిక అభివృద్ధికి సోషలిజమే ప్రత్యామ్నాయమని, కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంసీపీఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. రెండు రోజులపాటు జరిగే ఎంసీపీఐ (యు) రాష్ట్ర కమిటీ సమావేశాలు మంగళవారం స్థానికంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుందన్నారు. అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు పూనుకోవడం, యుద్ధాలు ఆపేందుకు సామ్రాజ్యవాద అమెరికా పూనుకోవడం పతనమవుతున్న సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు ఆదరణ ఏర్పడుతోందని శ్రీలంకలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వాన్ని గుర్తించాలన్నారు. దేశంలో బీజేపీ ప్రశ్నించే గొంతుకల భౌతిక నిర్మూలనకు తెగబడుతోందన్నారు. జమిలి ఎన్నికల నినాదం ముందుకు తేవడం, దొడ్డిదారిన రైతు వ్యతిరేక చట్టాల అమలుకు పూనుకోవడం లాంటి చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గాదగోని రవి, సైదమ్మ, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, కుంభం సుకన్న, నజీర్, రమేష్, హంసారెడ్డి, నర్రా ప్రతాప్ పాల్గొన్నారు.

హత్య కేసులో 17 మందికి జీవిత ఖైదు



- ఒక్కొక్కరికి రూ.6వేలు జరిమానా
- 2017లో ప్రతీకార హత్యచేసిన 18మంది
- విచారణలో ఉండగా అనారోగ్యంతో ఒకరు మృతి
- నిందితుల్లో ఎనిమిది మంది 30ఏళ్లలోపు వయస్సు వారే
- తీర్పు చెప్పిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ, జిల్లా 2వ అదనపు జడ్జి
- తీర్పు వెల్లడించగానే నిందితుల కన్నీటి పర్యంతం
- స్వగ్రామం యాదాద్రి జిల్లా ఆజీంపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు

•7లో..

'నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి'

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు నూరుశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంతో పాటు అంగడిపేట గ్రామ పంచాయతీలో శ్మశానవాటిక, కంపోస్ట్ షెడ్డులను, పీఏపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కంపోస్ట్ షెడ్డులో వర్మి కంపోస్ట్ రూపొందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులు అన్ని అప్డేట్ చేయాలని, ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలాగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో కొండల్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, కార్యదర్శులు రాంబాబు, అక్షితరెడ్డి, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను కొండమల్లేపల్లి పోలీసులు మంగళవారం మండలంలోని చెన్నారం గ్రామం వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దేవరకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణ శివారులోని మార్కండేయస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ వనం జగదీశ్వర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి రోజు ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బ్రాహ్మణ సంక్షేమానికి నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రవిప్రసాద్‌శర్మ

నేరేడుగొమ్ము, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని బ్రాహ్మణ సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవి ప్రసాద్‌శర్మ అన్నారు. నేరేడుగొమ్ము మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఉగాది పంచాంగం ఆవిష్కరణపై చర్చించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వంశీకృష్ణ, కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌శర్మ, పాల సదాశివశర్మ, గణేష్‌శర్మ, డేరం సతీష్‌శర్మ, భాస్కరశర్మ,ఉమాశంకర్, కృష్ణమూర్తి, ప్రభాకరశర్మ, వెంకటచార్యులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ చైర్మన్ పాండురంగరావు

దేవరకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవరకొండ మండలం పద్మట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ చల్లం పాండురంగరావు మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి ప్రత్యేక స్టడీ మెటిరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, హెచ్‌ఎం చిన్యానాయక్, మాజీ సర్పంచ్ కిన్నెర యాదయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● గుర్రంపోడు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాల ఎస్‌ఓ విజయశ్రీ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు చేతుల మీదుగా విద్యార్థినులకు మెటిరియల్ అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెండ్లిపాకల గ్రామానికి చెందిన కోనేరు ఆంజనేయులు అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. కాగా ఆయనతో పాటు 2004-05 బ్యాచ్‌లో పదో తరగతి స్నేహితులు చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చారు. రూ.46వేల నగదు, 50 కిలోల బియ్యం ఆంజనేయులు కుటుంబానికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, అనిమల్ల సురేష్, అందుగుల ఏడుకొండలు, బొడ్డుపల్లి శేఖర్, రమావత్ లచ్చిరాం, బొంత కొండల్, మారేపల్లి మల్లేష్, కొర్ర రాజు, వస్కుల శ్రీరాములు, యాదయ్య, కంచం వేణు,లచ్చయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

» హాలియాలో ఉత్తరభారతదేశ నమూనాలో భక్తాంజనేయస్వామి ఆలయ నిర్మాణం » హాజరుకానున్న ప్రముఖులు

హాలియా, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హాలియాలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వయంభూ భక్తాంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, అష్టబంధ సమర్పణ, మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉత్తరభారతదేశ నమూనాలో సుమారు రూ. 1.50 కోట్లతో ఆలయాన్ని నిర్మించారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నిర్మాణంలో తవ్వకాల్లో ఆంజనేయస్వామి విగ్రహం శంకుచక్ర సహిత స్వయంభూగా వెలిసిన భక్తాంజనేయస్వామిని గుర్తించి నాడు క్షేత్రపాలకుడిగా ప్రతిష్ఠించారు. బుధవారం నుంచి 23వ తేదీ వరకు ఆలయ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నారు. 22న చందనాదివాసము, ప్రతి ఇంటి నుంచి ఆడబిడ్డలు నిండు బిందెలతో నీళ్లు తీసుకురావాలి, ద్వార టకామయి భజన సమాజ్ వారిచే హనుమాన్ చాలీసా, రాత్రి 8.09 నిమిషాలకు కన్యాలగ్న సుమూహర్త సమయాన విగ్రహ ప్రతిష్ఠ, 23న స్వామివారి నిజ రూప దర్శనం, మహాపూర్ణం, మహా కుంభాభిషేకం, మహా అన్నదాన ప్రసాదం చేపట్టనన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సీఎల్‌పీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు తెలిపారు.



హాలియాలో నిర్మించిన భక్తాంజనేయ స్వామి ఆలయం

కాలనీ వాసులు స్వచ్ఛంద స్వాగతం

భక్తాంజనేయ ఆలయ నిర్మాణం కోసం హాలియాలోని సాయిబృందావన్ కాలనీ వాసులు స్వచ్ఛందంగా వారే నిర్మాణ కమిటీ వారికి, మాలలు ధరించి స్వాములను ఆహ్వానించి పూలతో స్వాగతం పలికి ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛందంగా సుమారు రూ. 3 లక్షల మేర ఆలయ నిర్మాణానికి సహకరించడం విశేషం. ఇదే స్ఫూర్తితో మరెంతో మంది దాతలు ఆలయ నిర్మాణంలో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు.

400 మంది మాలధారులు

ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి ఎక్కడైనా 30 మందికి మించి దీక్షలో మాలలు వేసి ఉన్న పరిస్థితి లేదు. ఇక్కడ మాత్రం 400 మంది నిష్ఠతో మాలలు ధరించి ప్రతి రోజు ఆలయంలో హనుమాన్ చాలీసా, హనుమాన్ అష్టోత్తరం, ఆంజనేయస్వామి దండకంతో పాటు భజన కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి మేము సైతం అంటూ పట్టణంలో ఇళ్లు తిరుగుతూ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరుతూ స్వామికి సేవ చేస్తున్నారు.

క్షేత్ర పాలకుడి అనుగ్రహంతో వృద్ధి



స్వయంభూ భక్తాంజనేయ స్వామి హాలియాకు క్షేత్ర పాలకుడని ఆలయ నిర్మాణంలో సహక రించిన వారందరికీ వారి అనుగ్రహం ఉంటుంది. స్వామి వారి అనుగ్రహంతోనే హాలియా ఇంతగా విస్తరించింది. ఈనెల 23న ప్రతిష్ఠోత్సవానికి ప్రతి ఇంటి నుంచి భక్తులు తరలి వచ్చి కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

- మేడేపల్లి మోహన్‌రావు,
రామాలయ కమిటీ చైర్మన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

డానియేల్, ఎంపీడీవో, దేవరకొండ



వేసవిలో మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు దేవరకొండ ఎంపీడీవో డానియేల్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో నీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు వెల్లడించారు.
(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

ఆంధ్రజ్యోతి: మండలంలోని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?
ఎంపీడీవో: ఇప్పటికే మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశాం. ముందస్తు ప్రణాళికలు రూపొందించి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పారిశుధ్య సమస్య మాటేమిటి?
ఎంపీడీవో: పారిశుధ్య సమస్య తలెత్తకుండా కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి పారిశుధ్య నివారణ చర్యలు చేపడు తున్నారు.
ఆంధ్రజ్యోతి: నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?
ఎంపీడీవో: మండలంలోని 41 గ్రామ పంచాయతీలకు గాను అన్ని పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. మండలంలో 2,32,100 లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యం. మొక్కలు ఎండిపోతే మళ్లీ విత్తనాలు వేసి పెంచుతున్నాం.
ఆంధ్రజ్యోతి: బీసీ కులగణన సర్వే మళ్లీ కొనసాగిస్తున్నారా?
ఎంపీడీవో: మండలంలో 95శాతంపైగా కులగణన సర్వే నిర్వహించాం. గతంలో పేర్లు నమోదు చేసుకొని వారు వెంటనే తమ పేర్లను ఎన్యూమరేటర్లకు తెలిపి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించాం.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ డీఈ సీహెచ్ విద్యాసాగర్ హెచ్చరించారు. మండలంలోని అంగడిపేట సబ్‌స్టేషన్ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి మండల విద్యుత్ లైన్‌మెన్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు జరుగుతుండడంతో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గృహజ్యోతి కంటే ముందు ఉన్న విద్యుత్ బిల్లులు వసూలు చేయాలన్నారు. రెండు నెలల్లో 7 ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనానికి గురైనందున సిబ్బంది గ్రామాల్లో చాటింపు వేయించి రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. రైతులు ఏర్పా టు చేసుకున్న హెవీ స్విచ్‌లు లేకుండా డైరెక్టుగా విద్యుత్ సరఫరా తాత్కాలింగా కొద్ది రోజులు ఏర్పాటు చేసి దొంగతనాలు నివారించాలన్నారు. 100 శాతం విద్యుత్ బిల్లులు వసూలు చేయాలన్నారు. వచ్చేది ఎండకాలం కాబట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఏడీ సైదులు, ఏఈ కావ్య పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

చింతపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల గ్రామానికి చెం దిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. కలిసిన వారిలో పోలేపల్లి నరేష్, బాదేపల్లి నిరంజన్ గౌడ్, బొడ్డు మధు పాల్గొన్నారు.

జాతరలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు



ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే జాతరలు మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాయకునితండాలో మంగళవారం నిర్వహించిన ముత్యాలమ్మ జాతరకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రా మాల్లో ఉత్సవాలు కలిసిమెలసి నిర్వహించు కోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి స్థానికులు గిరిజన సంప్రదాయ వేషధారణతో సత్కరించారు. ఆయన వెంట మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి గడ్డం సాగర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు రమావత్ కృష్ణా నాయక్ మునినాయక్ ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

చింతపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ బలపరిచిన పులి సర్వోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ నాయకులు మంగళవారం చింతపల్లిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, మండలాధ్యక్షుడు సముద్రాల నగేష్, శివర్ల రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించి బహుజన కులాల ఐక్యతను చాటాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కన్వీనర్ పుట్టం పురుషోత్తం కోరారు. కొండ మల్లేపల్లిలో మంగళవారం నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ స్థాయి మున్నూరుకాపు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాటాడారు. బీసీ ఉద్యమానికి దిక్సూచిగా పూల రవీందర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో అఖిల భారత హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతం సతీష్, దేవరకొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోట్ల జగదీశ్వర్, నిడమనూరు మండలాధ్యక్షుడు నరేందర్, పెద్దన్న పాల్గొన్నారు.

సీపీఐ గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి



చింతపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు

చింతపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సీపీఐను గ్రామస్థాయిలో బలోపేతానికి కృషి చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరావు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. డిండి, ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 నుంచి సీపీఐ గ్రామశాఖ కమిటీలను నియమించి మండల కేంద్రంలో నిర్వహించే మహాసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉజ్జిని యుగేంధర్‌రావు, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజల్ రావు, కొలుకులపల్లి కొండల్, బుచ్చయ్య పాల్గొన్నారు.

నాడు కళ కళ..నేడు వెలవెల



సాగర్ ఫైలాన్ కాలనీలో పచ్చని గడ్డితో కళకళలాడుతున్న శివం పార్కు(ఫైల్)



ప్రస్తుతం ఎండిన గడ్డితో వెలవెలబోతున్న శివం పార్కు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో పార్కుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఫైలాన్ కాలనీలో ప్రధాన డ్యామ్ అనుకొని శివం పార్కులో ఒకప్పుడు పచ్చనిగడ్డి, రంగు రంగుల పూల మొక్కలతో సినిమా షూటింగ్‌లో కళ కళలాడేది. సినీనటుడు రాజశేఖర్ నటించిన తలంబ్రాలు, అంకుశం వంటి సినిమా షూటింగ్‌లు ఇక్కడ జరిగాయి. కానీ నేడు ఈ పార్కు ఎండిన గడ్డితో కళావిహీనంగా దర్శనమిస్తుంది. దీంతో సాగర్‌కు వచ్చే పర్యాటకులు సేద తీరడానికి కనీసం ఒక్క పార్కు కూడా లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. సంబంధిత అధికారుల, పర్యాటక శాఖ చొరవ తీసుకొని పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కన్నీళ్లు మిగిల్చిన మిరప సాగు

(5వ పేజీ తరువాయి)

వరకు చెల్లించాలి. మొత్తంగా ఎకరా మిర్చి సాగుకు రైతుకు మొత్తం రూ.3.25లక్షలు పెట్టుబడి అవుతోంది. ఎకరా సాగుకు దిగుబడి 25 క్వింటాళ్లు వస్తుండగా, ప్రస్తుత మార్కెట్ ధర రూ.12,800 నుంచి రూ. 14,000 చొప్పున రూ.3.20లక్షల నుంచి రూ. 3.50 లక్షలు మిర్చి విక్రయిస్తే రైతుల చేతికి అందుతోంది. పెట్టుబడి రూ.3.25లక్షలు పోగా క్వింటాకు రూ.12వేల ధర లభిస్తే రైతుకు రూ.5వేలు నష్టం వాటిల్లుతుంది. క్విం టాకు రూ.14వేలు ధర పలికితే రైతకు కేవ లం రూ.25వేలు మాత్రమే మిగులుబాటు ఉంటుంది. కౌలు రైతు అయితే ఎకరానికి రూ.10 వేలు కౌలు అదనం. వీరికి మిగిలేది శూన్యం.

దిగుబడులు, ధర లేక

మిరపకు ఈ ఏడాది తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. వరుస తెగుళ్లతో వారానికోసారి మందులు పిచికారీ చేయాల్సి రావడంతో రైతులు ఆర్థిభారం మోశారు. 10 నెలల పంట కాలంలో పెట్టుబడులు పెరగడంతో చాలా వరకు 9నెలల ముందేను రైతులు పంటను వదిలేస్తున్నారు. గత ఏడాది 40క్వింటాళ్ల దిగుబడులు రాగా, ఈ ఏడాది ఎకరానికి 20-25 క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లగా క్వింటాకు రూ.18-21వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది మిర్చి సాగు పెరగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గిపోవడంతో ప్రస్తుతం క్వింటాకు రూ.12వేల నుంచి రూ.14వేల ధరతో భారీగా నష్టాలు వచ్చినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని ఆర్‌ఎంపీల సంఘం మండలాధ్యక్షుడు నూకపంగు శ్రీనివాస్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఆర్‌ఎంపీలు మంగళవారం చలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ఆర్‌ఎంపీలపై దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నిమ్మల వెంకన్న, జిల్లా కన్వీనర్ షేక్ రసూల్, పొదిల నాగరాజు, ఒగ్గు నర్సయ్య, భాస్కరాచారి, లక్ష్మణ్, రమణ, ఆసిఫ్, లక్ష్మీనారాయణ, వెంకటాచారి పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులను కలిసిన కృష్ణయ్య

చింతల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ పూర్వవైభవం తేవడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వ టస్కుల కృష్ణయ్య పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కిని నరసింహులను మంగళవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో చింతపల్లి ఘమండల యూత్ నాయకులు పొట్టబత్తుల విజయ్‌కుమార్(డాక్టర్), మాజీ అధ్యక్షుడు దోటి సంతోష్, సీతారాములు, బోడ ధనయ్యయాదవ్ పాల్గొన్నారు.

'ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు'

దామరచర్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మండల నాయకులు ధనావత్ సిద్ధు నాయక్, బంటు కిరణ్, చల్లా అంజిరెడ్డి అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ ఎదుట కేక్ కట్ చేసి తమ ప్రభుత్వ హయాంలోనే భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్తారని వారు అన్నారు. సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల నరసింహారెడ్డి, గాలం వేణు, పవన్‌నాయక్, మోహన్‌నాయక్, కోటిరెడ్డి, శివనాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యువతను రెచ్చగొడితే ఊరుకోం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నాగార్జునసాగర్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న యువతను రెచ్చగొడితే ఊరుకోం అని కాంగ్రెస్ ఓబీసీ సాగర్ పట్టణ ఉంగరాల శ్రీనివాస్ అన్నారు. సాగర్ హిల్‌కాలనీలో మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల మాట్లాడారు. ఎమ్మెల్సీ తీన్మానర్ తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా బీసీలలో ఘర్షణ వాతావరణం నెలకోల్పేలాగా మాట్లాడుతున్నారన్నాడు.మాజీ సీఎల్పీ నేత కుందురూ జానారెడ్డి మరణించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి బీఆర్ఎస్ నాయకల శునకానందం పొందుతుంటే సదరు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విచారణకు చేస్తే ఎస్ఐని దూషించడం ఎంత వరకు సమంజసం అన్నారు. బీసీలను జానారెడ్డి అణగదొక్కుతున్నాడని ఆరోపించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పగడాల నాగరాజు, జంగయ్య, రామకృష్ణ, చిన్నిరఘువీర్, సురేష్, శంకర్, యోహన్, జనార్దన్, రాంమ్మోహన్, ముజీప్, వేణు, ఖాసీం, రోషన్, రాజు తదితరులు ఉన్నారు.